
గుంటూరు హిందూ కాలేజి సెంటర్లో మానవహారం


ఎస్పీ తుషార్ డూడికి వినతిపత్రం అందిస్తున్న జర్నలిస్టులు

కలంపై దాడి.. సిగ్గు..సిగ్గు..

- గుంటూరులో వెల్లువెత్తిన నిరసనలు
- మహాత్మాగాంధీ విగ్రహానికి వినతిపత్రం
- హిందూ కళాశాల కూడలిలో మానవహారం
- ఎస్పీ కార్యాలయం వరకు భారీ ర్యాలీ, నినాదాలు
- విలేకర్లకు ప్రత్యేక రక్షణ చట్టం కావాలని డిమాండ్
- రాప్తాడు, కర్నూలు ఘటనలపై అఖిలపక్ష, జర్నలిస్టు సంఘాల ధ్వజం


గుంటూరు: హిమని సెంటర్లలో గాంధీజీ విగ్రహం వద్ద నిరసన తెలుపుతున్న జర్నలిస్టు సంఘాల నాయకులు, వివిధ రాజకీయ పార్టీల నేతలు, ప్రజా సంఘాలు


ర్యాలీలో పాల్గొన్న మాజీ మంత్రి ఆనందబాబు, మాజీ ఎమ్మెల్యేలు నరేంద్ర, మస్తాన్‌వలి, కనపర్తి, ప్రభాకర్, శేషయ్య, మన్నవ తదితరులు


హిందూ కాలేజి సెంటర్‌లో రోడ్డుపై కూర్చుని నిరసన

గుంటూరు, ఫిబ్రవరి 21(ఆంధ్రజ్యోతి): 'కలంపై దాడులా సిగ్గుసిగ్గు.. జర్నలిస్టులపై దాడులు హేయం..' అంటూ ప్రభుత్వ తీరుపై గుంటూరు జిల్లా జర్నలిస్టులు, అఖిలపక్ష నేతలు, ప్రజాసంఘాల నాయకులు ధ్వజమెత్తారు. జర్నలిస్టులపై దాడులను నిరసిస్తూ బుధవారం పాత్రికేయ సంఘాలు తలపెట్టిన నిరసన కార్యక్రమంతో గుంటూరు నగరం దద్దరిల్లిపోయింది. వందల మంది విలేకరులు, అఖిలపక్ష నేతలు, కార్యకర్తలు ప్రభుత్వ దౌర్జన్యాలకు వ్యతిరేకంగా కదంతొక్కారు. దిక్కులు పిక్కటిల్లేలా నినాదాలు చేశారు. రాప్తాడు 'సిద్ధం' సభలో ఆంధ్రజ్యోతి ఫొటో జర్నలిస్టు శ్రీకృష్ణపైన, కర్నూలు జిల్లాలో ఈనాడు కార్యాలయంపై వైసీపీ మూకల దాడులకు నిరసనగా బుధవారం గుంటూరులో ఏపీయూడబ్ల్యూజే, ఐజేయూ ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమానికి టీడీపీ, కాంగ్రెస్, సీపీఐ, బీజేపీ పార్టీలు మద్దతు తెలియజేశాయి. జిల్లాలోని ప్రింట్, ఎలక్ట్రానిక్ మీడియా ప్రతినిధులతోపాటు అన్ని పార్టీలు, అనుబంధ సంఘాల నేతలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. తొలుత గుంటూరు కార్పొరేషన్ కార్యాలయం సమీపంలోని మహాత్మా గాంధీ విగ్రహం వద్ద నిరసన తెపారు. మహాత్ముడి విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించి, దాడులను నిరసిస్తూ వినతిపత్రం అందజేశారు. అనంతరం అక్కడి నుంచి నినాదాలు చేస్తూ హిందూ కాలేజ్ సెంటర్లో మానవహారంగా ఏర్పడి నిరసన తెలిపారు. వైసీపీ మూకల దాడిలో తీవ్రంగా గాయపడిన ఆంధ్రజ్యోతి ఫొటో జర్నలిస్టు శ్రీకృష్ణకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. ఆ తర్వాత ఎస్పీ కార్యాలయం వరకు ర్యాలీ చేసి, ఎస్పీ తుషార్‌డూడీకి వినతిపత్రం అందజేశారు. జర్నలిస్టుల ప్రాణ రక్ష ణకు ప్రత్యేక చట్టం తీసుకురావాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో అఖిలపక్ష నేతలు మాజీ ఎమ్మెల్యే లింగంశెట్టి ఈశ్వరరావు, చిట్టాబత్తిన చిట్టిబాబు, కనపర్తి శ్రీనివాసరావు, సుఖవాసి శ్రీనివాసరవు, రావిపాటి సాయికృష్ణ, వేములకొండ శ్రీనివాస్, ఫిరోజ్, కార్పొరేటర్లు ఈరంటి బాబు, కొమ్మినేని కోటేశ్వరరావు, మానం శ్రీనివాసరావు, కసుకుర్తి హనుమంతరావు, సోమేపల్లి శివప్రసాద్, మద్దిరెడ్డి జగన్మోహన్‌రెడ్డి, షేక్ ఉస్మాన్, షేక్ బాజీ, బ్రహ్మం, షేక్ సుభాని, గంటా పెద్దబ్బాయి, మౌలిక, వీ.గంగాదర్, జర్నలిస్టు సంఘాల నేతలు భక్తవత్సలరావు, ఐజేయూ గిరధర్‌కుమార్, ఫణీంద్రకుమార్, నరసింహారావు, పరస్యం నాయక్, ఆసిఫ్, నిమ్మరాజు చలపతిరావు, ఎస్ రవికుమార్, ఆంధ్రజ్యోతి బ్రాంచ్ మేనేజర్ సూదా రామచంద్రరావు, ఎడిషన్ ఇన్‌చార్జి సూర్యదేవర సాంబశివరావు, బ్యూరో ఇన్‌చార్జి గింజుపల్లి భాస్కరరావు, స్టాఫ్ రిపోర్టర్లు మధుసూదనరావు, సతీష్, ఏబీఎన్ స్టాఫ్ రిపోర్టరు సాంబశివరావు, ఆంధ్రజ్యోతి యాడ్స్ మేనేజర్ ఎం.సుబ్బారావు, సర్క్యులేషన్ మేనేజర్ భాస్కర్‌రెడ్డి, సబ్ ఎడిటర్లు జీ.వెంకటేశ్వరరావు, సురేంద్ర, పరమేశ్వరరావు, వీరేష్‌కుమార్, బీ శ్రీనివాసరావు, జ్యోతి, లక్ష్మణ్, రిపోర్టర్లు, వివిధ విభాగాల సిబ్బంది పెద్దసంఖ్య లో పాల్గొన్నారు.

వివిధ ప్రాంతాల్లోనూ..

మీడియాపై రాష్ట్రంలో వరుసగా జరుగుతున్న దాడులపై ఉమ్మడి గుంటూరు జిల్లావ్యాప్తంగా నిరసనలు మిన్నంటాయి. పల్నాడు జిల్లా కేంద్రం నరసరావుపేటలో ప్రజాసంఘాలు, ఏపీయూడబ్ల్యూజే ఆధ్వర్యంలో ర్యాలీ జరిగింది. మున్సిపల్ కార్యాలయం సమీపంలో జర్నలిస్టులు మానవహారంగా ఏర్పడి నిరసన తెలిపారు. పత్రికా స్వేచ్ఛపై దాడి నశించాలి, ప్రజాస్వామ్యాన్ని కాపాడాలి అంటూ మహాత్మాగాంధీ విగ్రహం వద్ద నినాదాలు చేశారు. అనంతరం కలెక్టర్ శివశంకర్‌కు వినతి పత్రం అందజేశారు. పిడుగురాళ్ల, మాచవరం, రాజుపాలెంలో కూడా నిరసన ర్యాలీలు జరిగాయి. గుంటూరు జిల్లా ప్రత్తిపాడు, తుళ్లూరుల్లో అంబేద్కర్ బొమ్మల వద్ద నిరసన కార్యక్రమం జరిగింది. బాపట్ల జిల్లా భట్టిప్రోలు రథం సెంటర్‌లో జర్నలిస్టులు నిర్వహించిన నిరసన కార్యక్రమంలో మాజీ మంత్రి ఆనందబాబు పాల్గొన్నారు.

ప్రత్యేక చట్టం తీసుకురావాలి

విధి నిర్వహణలో భాగంగా సభలు, సమావేశాలను కవర్ చేసే విలేకరులపై దాడులు చేయడం అన్యాయం. దాడులకు బలైపోతున్న జర్నలిస్టుల సంక్షేమం కోసం కేంద్ర ప్రభుత్వం ప్రత్యేక చట్టం తీసుకురావాలి. పార్టీలు, సంస్థలు ఏవైనా విబేధాలు ఉంటే వాటికి జర్నలిస్టులను బలి చేయవద్దు. ప్రాణాంత కంగా మారిన నేపథ్యంలో జర్నలిస్టులకు రక్షణ చట్టం తేవాలి.దాడులకు తెగించిన వారిపై చర్యలు తీసుకోవాలి.

- ఎస్ఎన్ మీరా, ఏపీయూడబ్ల్యూజే

ప్రజలే బుద్ధి చెప్పాలి

విలేకరులపై దాడులు, దౌర్జన్యాలు దుర్మార్గం. అభ్యంతరం తెలపడానికి దాడులే మార్గమైతే, బూతులు తిట్టే మంత్రులను ఎన్నిసార్లు కొట్టాలి? ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేసేవారు రేపు ప్రజాకోర్టులో నుంచోవాలి. వారికి తగిన బుద్ధి ప్రజలే చెబుతారు. సీఎం బహిరంగ క్షమాపణ చెప్పాలి.

- నిమ్మల శేషయ్య

దాడి అమానుషం

పత్రికా విలేకరులపై దాడి అమానుషం. పత్రికా స్వేచ్ఛను హరించే స్థాయికి ప్రభుత్వం దిగజారడం సిగ్గుచేటు. నిజాన్ని నిర్భయంగా చూపించే మీడియాపై దాడి సీఎం అవినీతి అక్రమాలను కప్పిపుచ్చుకోవడానికే. ఎన్నికల నేపథ్యంలో పథకం ప్రకారం దాడులు చేయిస్తున్నారు. విలేకరులకు క్షమాపణ చెప్పి, బాధితుడికి న్యాయం చేయాలి.

- దేగల ప్రభాకర్

దాడులకు జగన్ ప్రోత్సాహం

రాష్ట్రంలో ప్రజలను, ప్రజాస్వామ్యాని తుంగలో తొక్కేందుకు సీఎం జగనే దాడులను ప్రోత్సహిస్తున్నారు. చేతులు మడతపెట్టాలని హింట్లు ఇచ్చి రెచ్చగొడుతున్నారు. వారి అవినీతి బాగోతాలు వెలికితీస్తున్న ఆంధ్రజ్యోతి,ఈనాడు సంస్థలపైనే దాడి చేయాలని సూచించినట్లు కనిపిస్తోంది. కొద్దిరోజుల్లో అధికారం మారుతుంది. దానికి తగిన మూల్యం చెల్లించుకోకతప్పదు. రాష్ట్రంలో రాక్షస పాలనను అంతమొందించి, ప్రజాస్వామ్యాన్ని రక్షించుకునేందుకు మీడియా సహా అందరూ ఏకమవ్వాలి.

- నక్కా ఆనందబాబు, మాజీ మంత్రి, టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యుడు

వినాశకాలే విపరీతబుద్ధి

పోయేకాలం దాపురిస్తే ఇలానే చేస్తారు. వినాశకాలే విపరీతబుద్ధి. రాష్ట్రంలో రాక్షస పాలన సాగుతోందని నాలుగేళ్ల క్రితమే చెప్పా. ఇక ఈ పాలనను తరిమికొట్టేందుకు సమయం వచ్చింది. అందరూ ఒక్కటై జగన్‌ను తరిమికొట్టాలి. - కన్నా లక్ష్మీనారాయణ, మాజీ మంత్రి

ప్రజాస్వామ్యం పరిహాసం

నాలుగో స్తంభమైన మీడియాపై దాడులు చేయిస్తున్న జగన్ ప్రజాస్వామ్యాన్ని పరిహసిస్తున్నారు. పాలనా వైఫల్యాలు, అవినీతి, అక్రమాలను వెలికితీస్తున్నా యన్న కోపంతోనే ఆంధ్రజ్యోతి, ఈనాడు లపై దాడులకు తెగిస్తున్నారు. పత్రికా స్వేచ్ఛను కాపాడుకుని, ప్రజాస్వామ్యాన్ని రక్షించుకోవాలి. - నరేంద్రకుమార్, మాజీ ఎమ్మెల్యే

రాష్ట్రంలో పాశవిక పాలన

పత్రికా స్వేచ్ఛపై దాడి చేసే పాశవిక పాలన ఈ రాష్ట్రంలో అమలు జరుగుతోంది. మీడియా గొంతు నొక్కేస్తున్నారు. తన అవినీతి, అక్రమాలు కప్పి పుచ్చుకునేందుకే మీడియాపై దాడి చేస్తున్నారు. పాత్రికేయులపై దాడులు చేయడం మానుకోకపోతే ప్రత్యక్ష తిరుగుబాటు తప్పదు. దాడులు, దౌర్జనాలకు తెగిస్తున్న పాలకులను ఓడించాలి. - ముప్పాళ్ల నాగేశ్వరరావు , సీపీఐ

సీఎం క్షమాపణ చెప్పాలి

ప్రజలు, ప్రజాస్వామ్యంపై రాక్షసులు దాడులు చేస్తారనడానికి నిదర్శనమే రాప్తా డు, కర్నూలు ఘటనలు. ఈ ఘటనలపై సీఎం జగన్ మీడియాకు బహిరంగ క్షమా పణ చెప్పాలి. వైసీపీ ప్రభుత్వం వచ్చాక మీడియాపై దాడులు పరిపాటిగా మారాయి. నియంతృత్వ పాలనకు ప్రజలే చరమగీతం పాడతారు. బాధితుడికి సొంత ఖర్చుతో వైద్యం అందించాలి. - మస్తాన్‌వలి, ఏపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్

ప్రజాస్వామ్యంపై దాడి

విలేకర్లపై దాడి ప్రజాస్వామ్యంపై దాడి. ప్రజా స్వామ్యాన్ని పరిరక్షించే మీడియా మిత్రులను భయభ్రాంతులకు గురిచేయాలని సైకో ముఖ్యమంత్రి వారిపై దాడులకు పాల్పడేలా చేస్తున్నారు. దాడులు చేసిన మూకలను వెంటనే అరెస్టు చేయాలి. పత్రికా స్వేచ్ఛను కాపాడాలి. ప్రజలు ఇలాంటి సీఎంకి తగిన బుద్ధి చెప్పాలి.

- మొహమ్మద్ నసీర్ , టీడీపీ తూర్పు ఇన్‌చార్జి

ప్రజాస్వామ్యాన్ని రక్షించుకోవాలి

రిపోర్టర్లపై దాడి హీనమైన చర్య. అవినీతి అక్రమాలపై ప్రశ్నిస్తున్నందునే అధికారపార్టీ మూకలను సీఎం దాడులకు పురిగొల్పుతున్నారు. పత్రికా స్వేచ్ఛను కాపాడుకుని ప్రజాస్వామ్యాన్ని పరిరక్షించుకోవాలి.

- మన్నవ మోహనకృష్ణ



రాజుపాలెం సెంటర్లో ర్యాలీ నిర్వహిస్తున్న జర్నలిస్టులు



భట్టిప్రోలు రథం సెంటర్‌లో జరిగిన జర్నలిస్టుల నిరసన కార్యక్రమంలో పాల్గొన్న మాజీ మంత్రి ఆనందబాబు


కలెక్టర్ శివశంకర్ లోతేటికి వినతి పత్రం అందజేస్తున్న వివిధ పార్టీల నాయకులు



పోలింగ్ కేంద్రాలపై కసరత్తు

- రాజకీయ పార్టీల నాయకులతో కలెక్టర్

బాపట్ల, ఫిబ్రవరి 21: సార్వత్రిక ఎన్నికల్లో ఓటర్ల సౌలభ్యం కొరకు పోలింగ్ కేంద్రాల మార్పులు, చేర్పులపై కసరత్తు చేస్తున్నట్లు కలెక్టర్ పి.రంజిత్‌బాషా తెలిపారు. గుర్తింపు పొందిన రాజకీయపార్టీల నాయకులతో బుధవారం కలెక్టరేట్‌లో ఆయన సమావేశమయ్యారు. సమావేశంలో కలెక్టర్ మాట్లాడుతూ ఓటర్ల పేర్లు, చిరునామాల మార్పులు, చేర్పులపై నమోదయ్యే దరఖాస్తులను తక్షణమే పరిష్కరిస్తామని చెప్పారు. మృతుల ఓటర్లను జాబితా నుంచి తొలిగించడానికి అన్ని చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించామన్నారు. రాజకీయపార్టీలు తమ అభ్యంతరాలపై లిఖితపూర్వక ఫిర్యాదులు చేయాలన్నారు. ఓటర్ల జాబితాలో సవరణలపై వచ్చిన ఫిర్యాదులను పరిగణనలోకి తీసుకుంటున్నామన్నారు. గత ఏడాది ఏప్రిల్ 1 నుంచి ఇప్పటి వరకు 2,28,622 దరఖాస్తులు రాగా 1,84,667 పరిష్కరించామన్నారు. 34,344 తిరస్కరించగా 9,611 దరఖాస్తులు పెండింగ్‌లో ఉన్నాయన్నారు. సమావేశంలో ఏవో కృష్ణకాంత్, ఎన్నికల విభాగం పర్యవేక్షకుడు సీతారామయ్య, బీజేపీ, కాంగ్రెస్, బీఎస్పీ, ఆమ్‌ఆద్మీ, సీపీఎం, వైసీపీ, టీడీపీ నాయకులు రామకృష్ణ, దోనేపూడి రవి, కాగిత కోటేశ్వరరావు, బాలాజిరెడ్డి, కోటేశ్వరరావు, ఇనగలూరి మాల్యాద్రి, షేక్.మహ్మద్‌గౌస్‌బాషా పాల్గొన్నారు.


నాయకులతో సమావేశమైన కలెక్టర్ పి.రంజిత్‌బాషా


సరిహద్దులో.. ఇసుక తోడేళ్లు

- అడ్డూ, అదుపు లేకుండా కాసులవేట
- పొరుగు నియోజకవర్గాలకు చెందిన ఎమ్మెల్యే, మంత్రి హస్తం
- వారికి కొమ్ము కాస్తున్న ఓ జిల్లా స్థాయి పోలీస్ అధికారి

చీరాల, ఫిబ్రవరి 21: సరిహద్దుల్లో ఇసుక తోడేళ్ల దందా... ఓ ఎమ్మెల్యే, ఓ మంత్రి హస్తం.. వారికి ఓ జిల్లా స్థాయి పోలీస్ అధికారి కొమ్ముకాస్తున్న వైనం. దీంతో అడ్డూ, అదుపు లేకుండా ఇసుకలో కాసులవేట యథేచ్ఛగా సాగుతోంది. చీరాల, బాపట్ల మండలాల సరిహద్దు కావూరివారిపాలెం సమీపంలో సహజ వనరుల దోపిడీ యథేచ్ఛగా సాగుతోంది. సెబ్, పోలీస్, రెవెన్యూ, మైనింగ్ ఏ శాఖ అధికారులు కూడా ఆ వైపు కన్నెత్తి చూడటం లేదు. దీంతో పగలు, రాత్రి తేడా లేకుండా ఇసుక అక్రమ తవ్వకాలు, రవాణా సాగుతున్నాయి. ఎక్స్‌కవేటర్లతో తవ్వకాలు సాగిస్తూ, టిప్పర్లతో ఇసుకను తరలిస్తున్నారు. నిత్యం వందల సంఖ్యలో టిప్పర్ల ద్వారా ఇసుక రవాణా జరుగుతోంది. ప్రస్తుతం ఇసుక తవ్వకాలు సాగిస్తున్న భూములు ఒకప్పుడు పంట పొలాలు. ఆ ప్రాంతంలో ఇసుక తవ్వకాలతో భారీ గోతులు ఏర్పడ్డాయి. వాటిలో ఊటనీరు చేరి చెరువులను తలపిస్తుంది. దీంతో చుట్టుపక్కల పొలాలు కూడా బీడు భూములుగా మారుతున్నాయని రైతులు వాపోతున్నారు. అనుమతులు పేరుతో అక్రమ దందా సాగిస్తున్నారని స్థానికులు బహిరంగంగానే విమర్శిస్తున్నారు. గతంలో పలు రాజకీయ పార్టీలు, ప్రజాసంఘాల ప్రతినిధులు ఆ ప్రాంతంలో జరుగుతున్న ఇసుక తవ్వకాలను నిలుపుదల చేయాలని ఉద్యమించారు. వారి ఆందోళన నేపథ్యంలో కేవలం ఒకటి, రెండు రోజులు మాత్రమే తవ్వకాలు ఆపి మమ అనిపించారు. ఆ తర్వాత యథావిధిగా ఎక్స్ కవేటర్లతో ఇసుక తవ్వకాలు మొదలుపెట్టారు. ఈపురు పాలెం వై జంక్షన్‌కు సమీపంలో కూడా భారీగా ఇసుక తవ్వకాలు సాగిస్తున్నారు. అక్కడ కూడా భారీగా గోతులు ఏర్పడి, ఊటనీటితో చెరువులను తలపిస్తున్నాయి. ఇదే పరిస్థితి బోయిన వారిపాలెంలో కూడా ఉంది. ఆయా ప్రాంతాల్లో ఇసుక గోతుల్లో గతంలో చిన్నారులు, మూగజీవాలు విగత జీవులైన సందర్భాలు ఉన్నాయి. ఉన్నతాధికారులు స్పందించి తగిన చర్యలు చేపట్టి అక్రమార్కులకు కళ్లెం వేయాలని ప్రజలు కోరుతున్నారు. ఈ విషయమై ఫోన్ ద్వారా సెబ్ సీఐ కర్ణను వివరణ అడిగేందుకు ప్రయత్నించగా ఆయన అందుబాటులోకి రాలేదు.


అక్రమంగా ఇసుకను తరలిస్తున్న టిప్పర్


ఇసుక తవ్వకాలతో భారీగా ఏర్పడిన గోతులు


చీరాల మండల కావూరివారిపాలెం సమీపంలో ఇసుక తవ్వకాలకు వినియోగిస్తున్న ఎక్స్‌కవేటర్లు

25న ఎయిమ్స్ జాతికి అంకితం

- హాజరుకానున్న గవర్నర్ అబ్దుల్‌నజీర్
- ఏర్పాట్లను పరిశీలించిన జిల్లా అధికారులు

మంగళగిరి సిటీ, ఫిబ్రవరి 21: మంగళగిరిలో ప్రతిష్ఠాత్మకంగా నిర్మితమైన అఖిల భారత వైద్య విజ్ఞాన సంస్థ(ఎయిమ్స్)ను ప్రధాని నరేంద్రమోదీ ఈ నెల 25న వర్చువల్ విధానంలో జాతికి అంకితం చేయనున్నారు. 183.11 ఎకరాల విస్తీర్ణంలో ఎయిమ్స్ నిర్మాణం జరిగింది. 960 పడకల ఆస్పత్రి, 125 ఎంబీబీఎస్ సీట్లతో వైద్య కళాశాల కోసం కేంద్రం రూ.1,618.23 కోట్లు ఖర్చు చేసింది. ఎయిమ్స్‌లో జరగనున్న ఈ కార్యక్రమానికి గవర్నరు ఎస్.అబ్దుల్ నజీర్ హాజరుకానున్నారు. ఇందుకోసం ఎయిమ్స్ వద్ద జరుగుతున్న ఏర్పాట్లను కలెక్టరు ఎం.వేణుగోపాల్‌రెడ్డి వైద్య ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ కమిషనరు జే.నివాస్, ఎస్పీ తుషార్‌దూడీతో కలిసి బుధవారం పరిశీలించారు. గవర్నరు, మంత్రులు, ఇతర ప్రముఖులు హాజరు కానున్న నేపథ్యంలో అందుకు తగ్గట్లు ఏర్పాట్లు చేయాలని అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో డీఆర్డీఏ పీడీ హరిహరనాథ్, సాంఘీక సంక్షేమ శాఖ డీడీ మధుసూదనరావు, డీఎంహెచ్‌వో డాక్టర్ విజయలక్ష్మి, ఇతర అధికారులు పాల్గొన్నారు.


ఏర్పాట్లను పర్యవేక్షిస్తున్న కలెక్టర్ వేణుగోపాల్‌రెడ్డి, నివాస్

దిక్సూచి DIKSUCHI

ఐఐటీ హైదరాబాద్‌లో స్యూర్ ఇంటర్న్‌షిప్

హైదరాబాద్‌లోని ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ(ఐఐటీ)- 'సమ్మర్ అండర్‌గ్రాడ్యుయేట్ రీసెర్చ్ ఎక్స్‌ప్లోజర్(స్యూర్)' ఇంటర్న్‌షిప్ ప్రోగ్రామ్‌లో ప్రవేశానికి దరఖాస్తులు కోరుతోంది. ప్రోగ్రామ్ వ్యవధి కనిష్ఠంగా ఒక నెల, గరిష్ఠంగా రెండు నెలలు ఉంటుంది. అభ్యర్థులు ఫుల్ టైమ్ వర్క్ చేయాల్సి ఉంటుంది. పార్ట్ టైమ్/ఆన్‌లైన్ విధానాలు లేవు. మొత్తం 200 సీట్లు ఉన్నాయి. వీటిలో 50 సీట్లను అమ్మాయిలకు కేటాయించారు. ఈ ప్రోగ్రామ్ పూర్తిగా ఉచితం. స్టయిపెండ్ కూడా ఇస్తారు. ఎంపికైనవారికి ఐఐటీ హైదరాబాద్ క్యాంపస్‌లో వసతి సౌకర్యం కల్పిస్తారు. అభ్యర్థులు మెస్ ఛార్జీలు మాత్రమే చెల్లించాల్సి ఉంటుంది. బేసిక్ మెడికల్ సర్వీస్ అందిస్తారు.

విభాగాలు

ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్, బయోమెడికల్ ఇంజనీరింగ్, బయోటెక్నాలజీ, కెమికల్ ఇంజనీరింగ్, కెమిస్ట్రీ, సివిల్ ఇంజనీరింగ్, కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజనీరింగ్, డిజైన్, ఎలక్ట్రికల్ ఇంజనీరింగ్, లిబరల్ ఆర్ట్స్, ఆంత్రప్రెన్యూర్‌షిప్ అండ్ మేనేజ్‌మెంట్, మెటీరియల్స్ సైన్స్ అండ్ మెటలర్జికల్ ఇంజనీరింగ్, మేథమెటిక్స్, సస్టయినబిలిటీ, క్లయిమేట్ ఛేంజ్, హెరిటేజ్ సైన్స్ అండ్ టెక్నాలజీ, ఇంటర్‌డిసిప్లినరీ ప్రోగ్రామ్, ఫిజిక్స్, మెకానికల్ అండ్ ఏరోస్పేస్ ఇంజనీరింగ్ విభాగాలు ఉన్నాయి. వీటికి నిర్దేశించిన పరిశోధనాంశాలను వెబ్‌సైట్‌లో చూడవచ్చు.

అర్హత

ఎమ్మెస్సీ(మేథ్స్/ఫిజిక్స్/కెమిస్ట్రీ/బయాలజీ)/ఎంఏ మొదటి ఏడాది చదువుతున్నవారు; బీటెక్(అన్ని విభాగాలు)/బీడిజైన్‌కు సంబంధించి రెండో ఏడాది/మూడో ఏడాది చదువుతున్నవారు; ఇంటిగ్రేటెడ్ బీటెక్-ఎంటెక్ ప్రోగ్రామ్‌నకు సంబంధించి మూడో ఏడాది/నాలుగో ఏడాది చదువుతున్నవారు దరఖాస్తు చేసుకోవచ్చు. ఇప్పటి వరకు పూర్తయిన సెమిస్టర్ ఎగ్జామ్స్‌లో అభ్యర్థులు నిర్దేశిత సీజీపీఏ స్కోర్‌లో టాప్ 20 శాతం సాధించి ఉండాలి. ఫుల్ టైమ్/రెగ్యులర్ అభ్యర్థులు మాత్రమే అర్హులు. ఐఐటీ హైదరాబాద్‌కు చెందిన అభ్యర్థులు ఈ ప్రోగ్రామ్‌నకు అనర్హులుగా ప్రకటించారు.

ఎంపిక

ప్రిలిమినరీ స్ర్కీనింగ్ ద్వారా సెలెక్ట్ చేసిన అభ్యర్థులకు ఆన్‌లైన్ ఇంటర్వ్యూలు నిర్వహిస్తారు.



స్టయిపెండ్

అభ్యర్థులు ఒక నెల, నెలన్నర, రెండు నెలల వ్యవధిని ఎంచుకోవచ్చు. నెల ప్రోగ్రామ్‌నకు రూ. 7,500; నెలన్నర ప్రోగ్రామ్‌నకు రూ.10,000; రెండు నెలల ప్రోగ్రామ్‌నకు రూ.15,000లను స్టయిపెండ్ కింద చెల్లిస్తారు.

- **ప్రోగ్రామ్ వ్యవధి:** 2024 మే 15 నుంచి జూలై 14 వరకు
- **ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ:** మార్చి 10
- **ఎంపికైన అభ్యర్థుల జాబితా విడుదల:** ఏప్రిల్ 15
- **వెబ్‌సైట్:** iith.ac.in, https://iith.ac.in/research/SURE/

ఏపీ పాలిసెట్

ఆంధ్రప్రదేశ్-మంగళగిరిలోని స్టేట్ బోర్డ్ ఆఫ్ టెక్నికల్ ఎడ్యుకేషన్ అండ్ ట్రెయినింగ్(ఎస్‌బీటీఈటీ)- 'పాలిటెక్నిక్ కామన్ ఎంట్రెన్స్ టెస్ట్ (పాలిసెట్) 2024' నోటిఫికేషన్‌ను విడుదల చేసింది. తెలుగు రాష్ట్రాల అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవచ్చు.



విభాగాలు

మూడేళ్ల కోర్సులు: సివిల్, ఆర్కిటెక్చరల్ అసిస్టెంట్‌షిప్, మెకానికల్, ఆటోమొబైల్, ఎలక్ట్రికల్ అండ్ ఎలక్ట్రానిక్స్, ఎలక్ట్రిక్ వెహికిల్ టెక్నాలజీ, ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్, ఇంటర్నెట్ ఆఫ్ థింగ్స్, అప్లయిడ్ ఎలక్ట్రానిక్స్ అండ్ ఇన్‌స్ట్రుమెంటేషన్, కంప్యూటర్ ఇంజనీరింగ్, ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్ అండ్ మెషిన్ లెర్నింగ్, 3డీ యానిమేషన్ అండ్ గ్రాఫిక్స్, ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్, కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజనీరింగ్(ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్), క్లౌడ్ కంప్యూటింగ్ అండ్ బిగ్ డేటా, కమ్యూనికేషన్ అండ్ కంప్యూటర్ నెట్ వర్కింగ్, షైనింగ్, కమర్షియల్ అండ్ కంప్యూటర్ ప్రాక్టీస్, అప్పారెల్ డిజైన్ అండ్ ఫ్యాషన్ టెక్నాలజీ, మెటలర్జికల్ ఇంజనీరింగ్, టెక్స్‌టైల్ టెక్నాలజీ.

మూడున్నరేళ్ల కోర్సులు: బయో మెడికల్, కెమికల్ ఇంజనీరింగ్, కెమికల్ ఇంజనీరింగ్(ఆయిల్ టెక్నాలజీ/పెట్రో కెమికల్స్/ప్లాస్టిక్ అండ్ పాలిమర్స్/షుగర్ టెక్నాలజీ), సిరామిక్ ఇంజనీరింగ్ అండ్ టెక్నాలజీ, ప్యాకేజింగ్ టెక్నాలజీ

అర్హత: తెలుగు రాష్ట్రాలకు చెందిన స్టేట్ బోర్డ్ ఆఫ్ సెకండరీ ఎడ్యుకేషన్(ఎస్ఎస్సీ), సెంట్రల్ బోర్డ్ ఆఫ్ సెకండరీ ఎడ్యుకేషన్(సీబీఎస్ఈ), ఇండియన్ కౌన్సిల్ ఫర్ సెకండరీ ఎడ్యుకేషన్(ఐసీఎస్ఈ), నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఓపెన్ స్కూల్(ఎన్ఐఓఎస్), ఏపీ ఓపెన్ స్కూల్ సొసైటీ(ఏపీఓఎస్ఎస్), ఇతర రాష్ట్రాల బోర్డుల నుంచి మేథమెటిక్స్ ఒక సబ్జెక్టుగా పదోతరగతి ఉత్తీర్ణులై ఉండాలి. ప్రస్తుతం పరీక్షలు రాసేవారు కూడా అప్లయ్ చేసుకోవచ్చు. వయోపరిమితి నిబంధనలు లేవు.

ఏపీ పాలిసెట్ వివరాలు: దీనిని ఆబ్జెక్టివ్ విధానంలో నిర్వహిస్తారు. పరీక్ష సమయం రెండు గంటలు. ఇందులో మేథమెటిక్స్ నుంచి 50, ఫిజిక్స్ నుంచి 40, కెమిస్ట్రీ నుంచి 30 చొప్పున మొత్తం 120 మల్టిపుల్ చాయిస్ ప్రశ్నలు అడుగుతారు. ప్రశ్నలన్నీ ఏపీ స్టేట్ బోర్డు రూపొందించిన పదోతరగతి సిలబస్ ఆధారంగానే ఉంటాయి. సమాధానాలను ఓఎంఆర్ పత్రం మీద గుర్తించాలి. నెగెటివ్ మార్కులు లేవు. ప్రశ్నకు ఒక మార్కు చొప్పున మొత్తం మార్కులు 120. లాగ్ టేబుల్స్, క్యాలిక్యులేటర్స్, పేజర్స్, సెల్‌ఫోన్‌లను పరీక్ష హాల్‌లోకి అనుమతించరు. ప్రశ్నపత్రం తెలుగు, ఆంగ్ల మాధ్యమాల్లో ఉంటుంది.

ముఖ్య సమాచారం

- **ఫీజు:** జనరల్, బీసీ అభ్యర్థులకు రూ.400; ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు రూ100
- **ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ:** ఏప్రిల్ 5
- **ఏపీ పాలిసెట్ 2024 తేదీ:** ఏప్రిల్ 27
- **ఫలితాలు విడుదల:** మే 13
- **వెబ్‌సైట్:** polycetap.nic.in

'దిక్సూచి' వెబ్ పేజీలో..
సమాచారం కోసం ఈ క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి.
లేదా ఈ కింది యూఆర్ఎల్
https://ejyothy.com/2N5NZ6nలో చదవండి.



సన్నిహితుల సమక్షంలో

రకుల్ వివాహం

హీరోయిన్ రకుల్ ప్రీత్‌సింగ్ వివాహ బంధంలోకి అడుగుపెట్టారు. తన చిరకాల మిత్రుడు, నిర్మాత జాకీ భగ్నానీతో ఆమె వివాహం గోవాలోని ఐటీసీ గ్రాండ్ రిసార్ట్స్‌లో బుధవారం జరిగింది. ఉదయం సిఖ్ పద్ధతి ప్రకారం, సాయంత్రం సింధి సంప్రదాయ పద్ధతిలో జరిగిన వీరి వివాహ వేడుకలో కుటుంబ సభ్యులు, సన్నిహితులు మాత్రమే పాల్గొన్నారు. బాలీవుడ్ నుంచి అక్షయ్‌కుమార్, వరుణ్ ధావన్, జెనీలియా, టైగర్ ష్రాఫ్, శిల్పా శెట్టి, రాజ్ కుంద్రా, అర్జున్ కపూర్, ఆయుష్మాన్ ఖురానా తదితరులు హాజరయ్యారు.



'బినాకా గీత్ మాలా' అమీన్ సయానీ ఇక లేరు!



'బెహనో ఔర్ భాయియో' అంటూ 42 ఏళ్ల పాటు సిలోన్ రేడియోలో, ఆ తర్వాత వివిధ భారతిలోనూ 'బినాకా గీత్ మాలా' కార్యక్రమంతో హిందీ సినీ గీతాల మాలతో శ్రోతలను అలరించిన స్వరం మూగబోయింది. రేడియో అనౌన్సర్లకు, జాకీలకు పితామహుడు లాంటి అమీన్ సయానీ తన 91 ఏట గుండెపోటుతో బుధవారం ముంబైలో కన్నుమూశారు. ఆయన సమర్పించే 'బినాకా గీత్ మాలా' వినడం కోసం ఆ రోజుల్లో ప్రతి బుధవారం అంతా రేడియో ముందు చేరిపోయేవారు. ఈ కార్యక్రమంలో ప్రసారం చేసే పాట గురించి మధ్య మధ్యలో ఆయన చేసే వివరణ చాలా ఆసక్తికరంగా ఉండేది. 'బినాకా గీత్ మాలా' మాత్రమే కాకుండా క్విజ్ ప్రోగ్రామ్, షాలీమార్ సూపర్ జోడీ, 'సంగీత్ కే సితారే' వంటి కార్యక్రమాలు ఆయన నిర్వహించారు. 54 వేల రేడియో కార్యక్రమాలు నిర్వహించిన రికార్డ్ సృష్టించిన అమీన్ సయానీ 2009లో పద్మశ్రీ పురస్కారం పొందారు. ఇప్పటివరకూ పద్మశ్రీ పురస్కారం పొందిన రేడియో అనౌన్సర్ అమీన్ సయానీ మాత్రమే. అలాగే 'భూత్ బంగ్లా', 'బాక్సర్', 'ఖతాల్' వంటి చిత్రాల్లో అమీన్ నటించి, అనౌన్సర్ పాత్రలనే పోషించడం విశేషం.

వేడుకగా దాదాసాహెబ్ ఫాల్కే

అవార్డుల ప్రదానం



భారతీయ సినీరంగంలో ప్రతిష్ఠాత్మకంగా భావించే దాదాసాహెబ్ ఫాల్కే ఇంటర్నేషనల్ ఫిల్మ్ ఫెస్టివల్ 2024 మంగళవారం రాత్రి ముంబైలో కన్నుల పండుగగా జరిగింది. పలువురు సినీతారలు ఈ చిత్రోత్సవంలో సందడి చేశారు. 'యానిమల్' చిత్రానికి గాను సందీప్‌రెడ్డి వంగా ఉత్తమ దర్శకుడి పురస్కారం అందుకున్నారు. ఉత్తమ నటీనటులుగా 'జవాన్' చిత్రానికి షారూఖ్, నయనతార అవార్డు స్వీకరించారు. ఉత్తమ ప్రతినాయకుడిగా బాబీడియోల్, ఉత్తమ సంగీత దర్శకుడిగా అనిరుధ్ రవిచందర్ నిలిచారు. సంగీత ప్రపంచానికి అందించిన సేవలకు గాను యేసుదాస్ ప్రత్యేక పురస్కారం అందుకున్నారు. ఈ సందర్భంగా షారూఖ్‌ఖాన్ మాట్లాడుతూ 'దాదాసాహెబ్ ఫాల్కే అవార్డు అంటే నాకు చాలా గౌరవం. చాలా ఏళ్ల తర్వాత మళ్లీ ఉత్తమ నటుడి పురస్కారం దక్కినందుకు ఆనందంగా ఉంది. ఈ అవార్డును నాతో పాటు పురస్కారాలకు నామినేట్ అయిన తోటి నటీనటులకు అంకితమిస్తున్నాను. ఇంత గొప్ప గౌరవం దక్కేలా చేసినందుకు ప్రేక్షకులకూ, జవాన్ చిత్రబృందానికి నా ధన్యవాదాలు' అని పేర్కొన్నారు.

సూర్య కెరీర్‌లోనే హై బడ్జెట్ ఫిల్మ్



విభిన్న పాత్రలను పోషించడంలో ఎప్పుడూ ముందుండే తమిళ హీరో సూర్య ప్రస్తుతం పాన్ వరల్డ్ ఫిల్మ్ 'కంగువ'లో నటిస్తున్నారు. మొత్తం పది భాషల్లో విడుదల కానున్న ఈ పీరియాడిక్ యాక్షన్ ఫిల్మ్‌కు శివ దర్శకత్వం వహిస్తున్నారు. స్టూడియో గ్రీన్, యూవీ క్రియేషన్స్ సంస్థలు సంయుక్తంగా నిర్మిస్తున్నాయి. ఇందులో బాబీ డియోల్ కీలక పాత్ర పోషిస్తున్నారు. దిశా పటాని కథానాయిక. ఈ సినిమా డబ్బింగ్ వర్క్ ప్రారంభించారు సూర్య. ఆయన కెరీర్‌లోని హై బడ్జెట్ ఫిల్మ్‌గా రూపొందుతున్న ఈ చిత్రం విడుదల తేదీని త్వరలో ప్రకటిస్తారు. త్రీడీలోనూ 'కంగువ' విడుదల కానుంది.

'చిత్రజ్యోతి'లో మరిన్ని ఆసక్తికర కథనాల కోసం ఈ క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి. లేదా ఈ కింది యూఆర్ఎల్
https://ejyothy.com/EsKRWQ0
లో చదవండి.



నిరుపయోగంగా ఉన్న గోదావరి-పెన్నా నదుల అనుసంధానానికి ఉపయోగించే యంత్రాలను చూపిస్తున్న కన్నా లక్ష్మీనారాయణ

జగన్‌లాంటి దుర్మార్గులను తరిమేయాలి

- శిథిలమౌతున్న రూ. కోట్ల విలువచేసే యంత్ర సామగ్రి
- మాజీ మంత్రి కన్నా లక్ష్మీనారాయణ

రాజుపాలెం, ఫిబ్రవరి21: వందల కోట్ల రూపాయలు విలువచేసే యాంత్రాలను మట్టిపాలు చేసిన ఈ సీఎం జగన్‌లాంటి వారిని తరిమేయాలని టీడీపీ జనసేన పార్టీల సత్తెనపల్లి నియోజకవర్గ ఉమ్మడి అభ్యర్థి కన్నా లక్ష్మీనారాయణ పిలుపునిచ్చారు. బుధవారం గుంటూరు-మాచర్ల రహదారిపై మండలంలోని రాజుపాలెం గ్రామ సమీపంలోవున్న గోదావరి-పెన్నా నదుల అనుసంధానం నిమిత్తం ఉపయోగించే యాంత్రాలను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా కన్నా మాట్లాడుతూ 2014-19 మధ్య ఈ రాష్ట్రంలో అధికారంలో ఉన్న టీడీపీ ప్రభుత్వం ముందు చూపుతో ఈ ప్రాంత ప్రజలకు తాగు, సాగు నీరు అందించాలనే ఉద్దేశంతో గోదావరి-పెన్నా అనుసంధానం చేసేందుకు లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టు నిర్మాణ నిమిత్తం రూ.6 వేల కోట్లు మంజూరు చేసి పని కూడా ప్రారంభించారని తెలిపారు. ఎన్నికల అనంతరం వైసీపీ అధికారంలోకి రావడం, జగన్‌రెడ్డి ముఖ్యమంత్రిగా కావటంతో ఈ ప్రాజెక్టు మరుగున పడిపోయిందన్నారు. అప్పటి నుంచి వందల కోట్ల రూపాయల విలువ చేసే భారీ యంత్రసామగ్రి నిరుపయోగంగా మారిందని, ప్రజల తాగు, సాగు నీటి కష్టాలు తీర్చే ప్రాజెక్టు పని కనుమరుగైందని ఆవేదన వ్యక్తం చేశారు.

ప్రమాదకర స్థాయిలో శాంతి భద్రతలు

- మాజీ మంత్రి ప్రత్తిపాటి పుల్లారావు

చిలకలూరిపేట అర్బన్, ఫిబ్రవరి21: ఐదు సంవత్సరాలుగా రాష్ట్రాన్ని అరాచకానికి కేరాఫ్ అడ్రస్‌గా మార్చిన సీఎం జగన్‌రెడ్డి పాలనలో కొన్ని రోజులుగా శాంతి భద్రతలు మరింత ప్రమాదంలో పడ్డాయని మాజీ మంత్రి ప్రత్తిపాటి పుల్లారావు ఆందోళనవ్యక్తంచేశారు. బుధవారం చిలకలూరిపేట గోల్డ్‌బజారులో నిర్వహించిన బాబు ష్యూరిటీ భవిష్యత్‌కు గ్యారెంటీ కార్యక్రమంలో ప్రత్తిపాటి, జనసేన సమన్వయకర్త తోట రాజారమేష్‌లు పాల్గొని టీడీపీ, జనసేన ఉమ్మడి ప్రభుత్వం అధికారంలోకి రాగానే అమలు చేయబోయే సూపర్ 6 సంక్షేమ పథకాల గురించి స్థానిక బంగారు వర్తకులకు, ప్రజలకు వివరిస్తూ కరపత్రాలను పంపిణీ చేశారు. అనంతరం ఆర్యవైశ్యులతో సమావేశం అయ్యారు. ఈ సందర్భంగా ప్రత్తిపాటి మాట్లాడుతూ నాలుగున్నర దశాబ్దాల చంద్రబాబు రాజకీయ అనుభవంతో ఈ సూపర్ - 6 హామీలకు రూపకల్పన చేశారని అన్నారు. కొన్ని రోజులుగా ప్రతిపక్షాలు, పత్రికలు లక్ష్యంగా చేసుకొని పెరిగిన వైసీపీ దాడులు అత్యంత హేయం అన్నారు. నిజాలను చూపిస్తుంటే జీర్ణించుకోలేక వైఫల్యాలను ప్రశ్నిస్తుంటే తట్టుకోలేక ఇలా దౌర్జన్యాలకు దిగుతున్నారని, ప్రజాస్వామ్యంలో ఇలాంటి పోకడలకు తావు లేదని ప్రత్తిపాటి పేర్కొన్నారు. తెలుగుదేశం, జనసేన ఉమ్మడి ప్రభుత్వం రాగానే గాడి తప్పిన శాంతి భద్రతలను చక్కదిద్దుతామని, జగన్ ప్రభుత్వ అండ చూసుకొని ఇప్పుడు ఇలా అరాచకాలకు పాల్పడుతున్న వారందరిపై తప్పక చర్యలు ఉంటాయని హెచ్చరించారు. జనసేన నేత తోట రాజా రమేష్ మాట్లాడుతూ రానున్న ఎన్నికల్లో పవన్‌కళ్యాణ్, చంద్రబాబుల నేతృత్వంలో జనసేన, తెలుగుదేశం కూటమి అభ్యర్థులను గెలిపించి రాష్ట్ర అభివృద్ధి, ప్రజా సంక్షేమానికి పట్టం కట్టాలని ప్రత్తిపాటి పుల్లారావు కోరారు.

విలేకరులపై దాడులు హేయం

- చొక్కామడతపెట్టడమంటే దాడులు చేయమనా..!
- మాజీ మంత్రి ఆలపాటి రాజేంద్రప్రసాద్



మాట్లాడుతున్న మాజీ మంత్రి ఆలపాటి రాజేంద్రప్రసాద్

తెనాలి రూరల్, ఫిబ్రవరి 21: సిద్ధం సభలో జగన్‌మోహన్‌రెడ్డి చొక్కా మడతపెట్టమనడం అంటే ప్రజలకు సమాజపోకడలను నిర్భయంగా తెలిపే విలేకరులపై దాడులు చేసి చావబాదటమేనా అని మాజీ మంత్రి ఆలపాటి రాజేంద్రప్రసాద్ ప్రశ్నించారు. బుధవారం పట్టణంలోని మారీసుపేట పెండ్యాల వెంకట్రావు కల్యాణమండపంలో బుధవారం బీసీ సంఘనేతలతో మాజీ మంత్రి ఆలపాటి రాజేంద్రప్రసాద్ ఆత్మీయ సమావేశం నిర్వహించారు. అనంతరం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో రాజేంద్రప్రసాద్ మాట్లాడుతూ జగన్ రెడ్డి అధికారం చేపట్టిన నాటి నుండి దాడుల సంస్కృతికి తెరలేపారని ఆరోపించారు. అది పెరిగి పెరిగి చివరకు పత్రికా విలేకరులు, ఫొటోగ్రాఫర్లపై దాడులకు పురమాయిస్తున్నాడని విమర్శించారు. జగన్‌రెడ్డి తన పదవీకాలంలో దోచుకోవడం, దాచుకోవడం, ప్రశ్నించిన వారిపై దాడులుచేయడం లేదా అక్రమకేసులు పెట్టి నోరు మూయించడం తప్ప చేసిందేమీ లేదన్నారు. జగన్ సిద్ధం సభకు వచ్చిన విలేకరులు, ఫొటోగ్రాపర్లపై వైసీపీ మూక దాడిచేసి, చిత్రహింసలు పెడుతుంటే రక్షణ కల్పించాల్సిన పోలీసులు ఎందుకు కాపాడలేకపోయారని ప్రశ్నించారు. చివరికి ఆ మూకల నుండి పోలీసులు గాయపడిన విలేకరులను ఆసుపత్రికి తరలించకుండా పోలీస్ స్టేషన్‌కు తరలించడం దుర్మార్గమన్నారు.సామాజిక న్యాయం, పత్రికా స్వేచ్ఛకు ఈ ప్రభుత్వంలో భద్రత ఎక్కడుందో ప్రజలందరూ ఆలోచించాలన్నారు. సమాజంలో ప్రభుత్వానికి ప్రజలకు వారధులుగా నిజాన్ని నిర్భయంగా రాసే పత్రికల స్వేచ్ఛపై దాడి చేయడం వైసీపీ నీచ సంస్కృతికి నిదర్శనమన్నారు. ముఖ్యమంత్రిగా జగన్ ప్రజలకు మంచి చేసి ప్రశాంత వాతావరణం నెలకొల్పాసింది పోయి దాడులను ప్రోత్సహిస్తున్న తీరు చేస్తుంటే యువతరం ఏమైపోతుందోనని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రభుత్వ వైఫల్యాలను ఎత్తి చూపిస్తున్న పత్రిక యాజమాన్యాన్ని కూడా వదిలిపెట్టని పరిస్థితికి జగన్ దిగజారడం చూస్తుంటే ప్రజాస్వామ్యానికి, పత్రికా స్వేచ్ఛకు ఆయన ఇచ్చే విలువేంటో తేటతెల్లమైందన్నారు. నా ఎస్సీలు, నా బీసీలు, నా మైనార్టీలు అంటూ చెబుతూనే వారిపై చేస్తున్న అరాచకాలు, నిరంకుశ పాలన వంటి అంశాలను వెలుగులోకి తెస్తున్నారన్న అక్కసుతో ఇటువంటి వాటికి పాల్పడుతున్నారని ధ్వజమెత్తారు. ఆ నాడు జగన్ తండ్రి వైఎస్ రాజశేఖర్‌రెడ్డి పత్రికా స్వేచ్ఛ హరించే 930వ జీవోను తీసుకువస్తే అపట్లో జరిగిన ఆందోళనలకు వెనక్కి తీసుకున్నారని నేడు మళ్ళీ కొడుకుగా జగన్ ఆజీవోని తీసుకువచ్చారన్నారు. సిద్ధం సభలో సీఎం జగన్‌రెడ్డి చొక్కా చేతులు మడవండి అంటే తమకు వ్యతిరేకంగా ఎవరున్నా వారిని చావ బాదమని చెబుతూ వారి పార్టీ శ్రేణులకు ఉసి గొల్పటమేనా అని ప్రశ్నిచారు. విలేకరులపై దాడులు చేసిన మూకలను పోలీసులు మూడు రోజులకు గాను ఒక్కడిని మాత్రమే పట్టుకుని అరెస్ట్ చేసి నాన్చుడు ధోరణితో వ్యవహరిస్తున్న పరిస్థితి స్పష్టంగా కనిపిస్తుందన్నారు. తక్షణమే దాడులకు పాల్పడిన నిందితులను పట్టుకుని మరో మారు ఇటువంటి ఘటనలకు తావు లేకుండా కఠిన శిక్షలు విధించాలని ఆలపాటి డిమాండ్ చేశారు. పట్టణ, మండల పార్టీ అధ్యక్షులు తాడిబోయిన హరిప్రసాద్, కేసన కోటేశ్వరరావు, గిరి గణేష్, ఫణిదపు దుర్గ, పలువురు నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

మర్రెడ్డిపై హత్యాయత్నం దుర్మార్గం

- టీడీపీ పల్నాడుజిల్లా అధ్యక్షుడు జీవీ ఆంజనేయులు



సమావేశంలో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు

వినుకొండ, ఫిబ్రవరి 21: తెలుగు రైతు సంఘం అధ్యక్షుడు మర్రెడ్డి శ్రీనివాసరెడ్డిపై జరిగిన హత్యాయత్నాన్ని పల్నాడు జిల్లా టీడీపీ అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు తీవ్రంగా ఖండించారు. స్థానిక పార్టీ కార్యాలయంలో బుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ హత్యాయత్నం వెనుక వైసీపీ నేతల హస్తం ఉందని విమర్శించారు. పార్టీ పట్ల అంకితభావంతో పనిచేస్తూ రైతు సమస్యలపై నిరంతరం పోరాటం చేస్తున్న మర్రెడిపై జరిగిన దాడి అమానుషమని అన్నారు. వ్యక్తిగత కక్షతో తనను హతమార్చేందుకు కిరాతకంగా పథకం ప్రకారం దాడి చేశారన్నారు. జేమ్స్ ఆసుపత్రి యజమాని రామచంద్రారెడ్డి వెనుక వైసీపీ నాయకుల ప్రోత్సాహం, కుట్ర దాగి ఉందని ఆయన ఆరోపించారు. అదేవిధంగా కర్నూలులో ఈనాడు ప్రాంతీయ కార్యాలయంపై వైసీపీ దుండగుల దాడి అత్యంత హేయనీయమైన చర్య అని అన్నారు. వినుకొండలో ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు రౌడీయిజాన్ని ప్రోత్సహిస్తున్నారని ధ్వజమెత్తారు. మంగళవారం ఎమ్మెల్యే బొల్లా జన్మదిన వేడుకలు జరుపుకుంటూ టీడీపీ బ్యానర్లు చించివేయించడం, ధ్వంసం చేయించి అల్లర్లను రెచ్చగొడుతున్నారన్నారు. టీడీపీ హయాంలో జరిగిన అభివృద్ధి పనులకు సంబంధించి శిలాఫలకాలు కూడా ధ్వంసం చేయించడం దుర్మార్గమన్నారు. ఆసుపత్రి నిర్మించకుండానే బొల్లా బ్రహ్మనాయుడు 100 పడకల ఆసుపత్రిని నిర్మించామని ఉదరగొట్టడం హాస్యాస్పదమన్నారు. వరికపూడిశెల ప్రాజెక్టు నిర్మాణం చేసే ఆలోచన వైసీపీకి లేదని, జీవో ఇచ్చి నిధులు కేటాయించిన టీడీపీతోనే వరికపూడిశెల ప్రాజెక్టు నిర్మాణం సాధ్యమని స్పష్టం చేశారు. కార్యక్రమంలో పెమ్మసాని నాగేశ్వరరావు, షమీమ్ ఖాన్, ముంద్రు సుబ్బారావు, మద్దుల వెంకటేశ్వరరెడ్డి, పత్తి పూర్ణ, మాదాల కృష్ణ తదితరులు పాల్గొన్నారు.



గంజాయి విక్రేతను అరెస్టు చూపిస్తున్న సీఐ కోటేశ్వరరావు

గంజాయి విక్రేత అరెస్టు

- 1 కిలో సరుకు స్వాధీనం.. ఆటో సీజ్

చేబ్రోలు, ఫిబ్రవరి21: గంజాయి తాగడంతోపాటు విక్రయాలకు పాల్పడుతున్న ఒరిస్సాకు చెందిన వ్యక్తిని అరెస్టు చేసి ఒక కిలో గంజాయిని స్వాధీనం చేసుకున్నట్లు పొన్నూరు రూరల్ సీఐ వై.కోటేశ్వరరావు తెలిపారు. బుధవారం చేబ్రోలు పోలీస్‌స్టేషన్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో నిందితుడి అరెస్టు, వివరాలను సీఐ వెల్లడించారు. ఒరిస్సా రాష్ట్రానికి చెందిని గురుశెట్టి అనే వ్యక్తి రెండేళ్ల క్రితం కుటుంబంతో సహా బదుకుతెరువు కోసం చేబ్రోలు వచ్చి స్పినింగ్ మిల్‌లో పనిచేస్తున్నాడు. గురిశెట్టికి సోమనాథ్ అనే వ్యక్తి పరిచయం కాగా ఇద్దరు గంజాయికి బానిసలయ్యారు. వారం రోజుల క్రితం పలాసకు చెందిన బాలకృష్ణ అనే వ్యక్తి సోమనాథ్‌కు ఒక కిలో గంజాని తీసుకొచ్చి ఇచ్చాడు. ఈ నెల 20న గురుశెట్టి ఆ గంజాయిని అమ్మటానికి ఆటోలో వెళ్లతుండగా విశ్వసనీయ సమాచారం మేరకు పోలీసులు అదుపులోకి తీసుకొని, గంజాయిని స్వాధీనం పోలీసు స్టేషన్‌కు తరలించినట్లు సీఐ తెలిపారు. నిందితుడిని అరెస్టు చేయడంలో ప్రతిభ కనబరిచిన చేబ్రోలు పీఎస్ ఎస్ఐ పీ.మహేష్‌కుమార్, సిబ్బందిని అభినందించారు.

పెంపుడు కొడుకు చేతిలో తండ్రి హతం

- కత్తితో నరికి చంపిన కసాయి
- తల్లికీ తీవ్ర గాయాలు

పిడుగురాళ్ల, ఫిబ్రవరి 21: ఆస్తి కోసం పెంపుడు తండ్రిని నరికి చంపిన ఘటన పిడుగురాళ్ల పట్టణంలోని గాంధీనగర్‌లో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. పట్టణానికి చెందిన యోహాను(79), చిట్టెమ్మ భార్యాభర్తలు. యోహాను గతంలో ప్రభుత్వ శాఖలో పనిచేసి ఉద్యోగ విరమణ చేశాడు. వారికి సంతానం లేకపోవడంతో అన్న కుమారులైన అంబేద్కర్, బాబులను చిన్నతనం నుంచే పెంచుకున్నారు. అంబేద్కర్ సుమారు 40 కేసుల్లో ముద్దాయి కాగా రెండేళ్ల జైలు జీవితం గడిపి ఇటీవల బెయిల్‌పై వచ్చాడు. ఆ సమయంలో యోహానుకు పక్షవాతంరాగా తమ్ముడు బాబు సపర్యలు చేశాడు జైలు నుంచి వచ్చిన అంబేద్కర్ తనకు దక్కాల్సిన ఆస్తిని యోహాను.. బాబుకు కట్టపెడతాడనే అనుమానం పెంచుకున్నాడు. ఈ విష యమై కొద్ది రోజులుగా గొడవలు జరుగుతున్నాయి. దీనిపై పోలీస్‌స్టేషన్‌కు ఫిర్యాదు రాగా కుటుంబ సభ్యులు, పెద్దలు కూర్చొని ఆస్తివంపకాలు చేసుకోవాలని పోలీసులు సూచించారు. అయినా గొడవలు సద్దుమణగ లేదు. ఈక్రమంలో బుధవారం అంబేద్కర్ తన వెంటతెచ్చుకున్న కొబ్బరిబొండాల కత్తితో ఇంట్లోవున్న యోహాను ముఖంపై, మెడపై నరికాడు. యోహాను భయంతో వీధిలోకి పరిగెత్తాడు. అయినా వదలకుండా వీధిలోనే కత్తితో నరకడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. అడ్డొచ్చిన యోహాను భార్య చిట్టెమ్మను గాయపరచడంతో ఆమె స్థానిక ప్రైవేటు ఆస్పత్రిలో చికిత్స పొందుతోంది. సమాచారం అందుకున్న పట్టణ సీఐ పీవీ ఆంజనేయులు, డీఎస్పీ పళ్లంరాజు, ఎస్ఐ రబ్బాని, అమీర్‌లు ఘటనా స్థలా నికి చేరుకొని వివరాలు సేకరించి కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నారు.

విద్యుత్‌శాఖ ఏఈకి ఏసీబీ షాక్!

- రైతు వద్ద లంచం తీసుకుంటూ పట్టుబడ్డ వైనం
- రూ 55 వేలు లంచం సొమ్ము స్వాధీనం

చిలకలూరిపేట, ఫిబ్రవరి 21 : చిలకలూరిపేట విద్యుత్ శాఖ రూరల్ ఏఈ ఆర్.ప్రకాశరావునాయక్ బుధవారం తన కార్యాలయంలో లంచం తీసుకుంటూ ఏసీబీ అధికారులకు పట్టుబడ్డాడు. ఏసీబీ అధికారుల తెలిపిన వివరాల ప్రకారం.. చిలకలూరిపేట మండలం కమ్మవారిపాలెం గ్రామానికి చెందిన గడిపూడి అనీల్‌కుమార్ వ్యవసాయ విద్యుత్ సర్వీస్ మీటరు కోసం ప్రకాశరావు నాయక్ చుట్టూ గత కొంత కాలంగా తిరుగుతున్నాడు. ఇందుకు ప్రకాశరావు నాయక్ రూ.70వేలు లంచంగా ఇవ్వాలని డిమాండ్‌చేశాడు. లంచం ఇవ్వటం ఇష్టం లేని బాధితుడు ఏసీబీ అధికారులను ఆశ్రయించాడు. ఏసీబీ కాల్ సెంటర్‌కు ఫోన్‌చేసి ఏఈపై ఫిర్యాదు చేశాడు. దీంతో ఏసీబీ అధికారులు పథకం ప్రకారం రూ.55వేలు లంచం తీసుకుంటుండగా ఏఈ ప్రకాశరావునాయక్‌ను ఆయన కార్యాలయంలోనే పట్టుకున్నారు. ఏఈని అవినీతి నిరోధకశాఖ ప్రత్యేక న్యాయస్థానంలో హాజరుపెడతామని అధికారులు తెలిపారు. ఏసీబీ డీజీపీ కేవీ రాజేంద్రనాథ్‌రెడ్డి ఆదేశాల మేరకు అడిషనల్ ఎస్పీ మహేంద్ర మత్తె, డీఎస్పీలు సత్యానందం, ప్రతాప్‌కుమార్, ఆరుగురు సీఐలు తదితర సిబ్బంది ఈ దాడుల్లో పాల్గొన్నారు. అధికారులు లంచం అడిగితే 14400 నెంబరుకు ఫిర్యాదు చేయాలని డీజీపీ రాజేంద్రనాథ్‌రెడ్డి తెలిపారు.



జ్యోతి ప్రజ్వలన చేస్తున్న మల్లాది విష్ణు, లక్ష్మీపార్వతి, వీసీ రాజశేఖర్

తెలుగు భాషను కాపాడుకుందాం

- ఏఎన్‌యూలో ఘనంగా అంతర్జాతీయ మాతృభాషా దినోత్సవం

పెదకాకాని, ఫిబ్రవరి 21: దేశాభివృద్ధి ఆయా భాషా సంస్కృతులపై ఆధారపడి ఉంటుందని ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయ ఉపకులపతి ఆచార్య పట్టేటి రాజశేఖర్ అన్నారు. తెలుగు, సంస్కృత అకాడమీలు సంయుక్తంగా బుధవారం విశ్వవిద్యాలయంలోని వేణుగోపాల్‌రెడ్డి సెమినార్ హాల్లో అంతర్జాతీయ మాతృభాషా దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా వీసీ హాజరై తెలుగుభాషా ఔన్నత్యాన్ని వివరించారు. తెలుగు భాషను కాపాడుకోవడం మనందరి బాధ్యత అని పిలుపునిచ్చారు.విజయవాడ ఎమ్మెల్యే మల్లాది విష్ణు మాట్లాడుతూ తెలుగు సంస్కృత భాషలు ఎంతో గొప్పవని అన్నారు. ఆంధ్రప్రదేశ్‌లో తెలుగు సంస్కృత భాషలకు రాష్ట్ర ప్రభుత్వం పెద్దపీట వేస్తుందన్నారు. తెలుగు సంస్కృత భాష అకాడమీ చైర్మన్‌డాక్టర్ నందమూరి లక్ష్మీపార్వతి మాట్లాడుతూ రాష్ట్ర విభజన అనంతరం ఆంధ్రప్రదేశ్‌లో తెలుగు సంస్కృత భాషల అభివృద్ధికి సీఎం తోడ్పాటు అందిస్తున్నారన్నారు. ఇటువంటి కార్యక్రమాల నిర్వహణకు విశ్వవిద్యాలయం అందిస్తున్న తోడ్పాటు పట్ల ఉపకులపతి రాజశేఖర్‌కు ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో అకాడమీ సంచాలకులు వీ.రామకృష్ణ, విశ్వవిద్యాలయ రెక్టర్ ఆచార్య పి.వరప్రసాద మూర్తి, రిజిస్ట్రార్ ఆచార్య బి.కరుణ, ఉద్యోగులు పాల్గొన్నారు. అనంతరం భాషా పండితులకు సన్మానం చేశారు.

మళ్లీ క్రైస్తవులను మోసం చేసేందుకు జగన్ పన్నాగం

- టీడీపీ క్రిష్టియన్ సెల్ రాష్ట్ర అధ్యక్షులు స్వామిదాసు



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న టీడీపీ నాయకులు

చిలకలూరిపేట అర్బన్, ఫిబ్రవరి 21: రాష్ట్రంలో క్రైస్తవులను మరోసారి మోసం చేసేందుకు రాష్ట్ర ముఖ్యమంత్రి జగన్‌రెడ్డి తెరలేపారని తెలుగుదేశం పార్టీ క్రిష్టియన్ సెల్ రాష్ట్ర అధ్యక్షులు ఈటె స్వామిదాసు విమర్శించారు. బుధవారం స్థానిక తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో దాదాపు 75వేల మంది పాస్టర్లు ఉంటే కేవలం పది శాతం మందికే గౌరవ వేతనాలు ఇస్తూ మిగిలిన వారిని నిలువునా మోసం చేస్తున్నారని అన్నారు. చర్చిలు, శ్మశానవాటికలు, క్రైస్తవ కాలనీలు ఎన్ని నియోజకవర్గాల్లో ఏర్పాటు చేశారో చెప్పాలని డిమాండ్ చేశారు. ప్రతి చర్చి నిర్మాణానికి రూ.5 లక్షలు ఫండ్ ఇస్తానని చెప్పి క్రైస్తవుల ఓట్లను దండుకున్నారని అన్నారు. బ్రదర్ అనిల్ రాష్ట్రంలోని పాస్టర్లతో సమావేశాలు ఏర్పాటు చేసి మేనిఫెస్టో చూపించి జగన్‌ను గెలిపిస్తే క్రైస్తవులకు మంచి రోజులు వస్తాయని చెప్పారన్నారు. క్రైస్తవుల ఓట్లతో గెలుపొంది గడిచిన నాలుగున్నర సంవత్సరాలుగా ఏ ఒక్క సంక్షేమ పథకం ఇవ్వకుండా నిలువునా మోసం చేశారని ఆయన వాపోయారు. ఇప్పుడు విమలారెడ్డి రాష్ట్ర వ్యాప్తంగా క్రైస్తవులకు మోసపూరిత హామీలు ఇస్తున్నారని, క్రైస్తవులపై దాడులు జరిగినప్పుడు, ఆస్తులు ఆక్రమించినప్పుడు వీరంతా ఏమయ్యారో సమాధానం చెప్పాలన్నారు. గత టీడీపీప్రభుత్వ హయాంలో 277 చర్చిలు నిర్మించామని, వైసీపీ ప్రభుత్వంలో ఒక్క చర్చి అయినా నిర్మించారా? అని ప్రశ్నించారు. కార్యక్రమంలో క్రిష్టియన్ నేతలు శ్యామ్, ఇనగంటి జగదీష్ తదితరులు పాల్గొన్నారు.



వీవీఐటీలో విద్యార్థులతో సినీ హీరో వరుణ్ తేజ్

వీవీఐటీలో వరుణ్ తేజ్ సందడి

పెదకాకాని, ఫిబ్రవరి 21 : సినీ హీరో వరుణ్ తేజ్ వీవీఐటీ కళాశాలలో బుధవారం సందడిచేశారు. ఆయన నూతనంగా నటించిన ఆపరేషన్ వాలంటైన్ చిత్రం మార్చి 1న విడుదల కానున్న నేపథ్యంలో చిత్ర ప్రచారంలో భాగంగా ఆయన వీవీఐటీని సందర్శించారు. ఈ సందర్భంగా హీరో వరుణ్ తేజ్ మాట్లడుతూ దేశభక్తి మనలో అంతర్లీనంగా ఉంటుందని, ఈ చిత్రం దేశభక్తి చిత్రం అని అన్నారు. ఇటువంటి చిత్రం ద్వారా మీముందుకు రావడం ఆనందంగా ఉందని అన్నారు. ఈచిత్రం ద్వారా జవాన్ల త్యాగాలు వారి ధైర్య సాహసాలను మీముందుకు తీసుకువచ్చే ప్రయత్నం చేశామని తెలిపారు. ఈ చిత్రం చూసిన అనంతరం భారతీయులుగా పుట్టినందుకు గర్వంగా బయటికి వస్తారని అన్నారు. పేక్షకులకు నిరంతరం కొత్తదనం అందించే ప్రయత్నం చేస్తుంటానని అన్నారు. అనంతరం విద్యార్థులు సెల్ఫీలతో సందడి చేశారు.



తుళ్లూరు రైతు ధర్నా శిబిరంలో నినాదాలు చేస్తున్న మహిళలు , రైతులు

అమరావతిపై కక్ష పెంచుకుంటే వైసీపీకే నష్టం

- 1527వ రోజుకు చేరిన రైతుల ఆందోళనలు, దీక్షలు

తుళ్లూరు, ఫిబ్రవరి 21: రాజధాని అమరావతిపై కక్ష పెంచుకుంటే వైసీపీ పాలకులకే నష్టమని రాజధాని నిర్మాణానికి 33వేల ఎకరాలు త్యాగం చేసిన రైతులు అన్నారు. బిల్డ్ అమరావతి, సేవ్ ఆంధ్రప్రదేశ్ అంటూ రైతులు, రైతు కూలీలు, మహిళలు చేస్తున్న ఆందోళనలు బుధవారం నాటికి 1527వ రోజుకు చేరుకున్నాయి. ఈ సందర్భంగా రైతు ధర్నా శిబిరాల నుంచి వారు మాట్లాడుతూ, ఐదు కోట్లమంది కోరుకునే రాజధాని అమరావతి విధ్వంసం తగదని సీఎం జగన్‌రెడ్డికి హితవు పలికారు. ప్రత్యేక హోదా తెచ్చి రాష్ట్రంలోని మూడు ప్రాంతాలను అభివృద్ధి చేయాలన్నారు. కేంద్రం మెడలు వంచి ప్రత్యేక హోదా తెస్తామన్న జగన్‌రెడ్డి, అదే కేంద్రం ముందు మోకరిల్లారని ఆరోపించారు. సీఎంకి దమ్ముంటే విభజన చట్టంలో హామీలను అమలు పరిచి రాష్ట్రాన్ని అభివృద్ధి చేయాలని డిమాండ్ చేశారు. మూడు రాజధానులు కావాలని రాష్ట్రంలో ఏ ఒక్కరూ అడగలేదన్నారు. ప్రజాభిప్రాయం లేకుండా మూడు ఎలా పెడతారని ప్రశ్నించారు. భారత రాజ్యాంగంలో లేని మూడు రాజధానుల ప్రతిపాదన తేవటానికి సీఎం జగన్‌రెడ్డికి సిగ్గుండాలన్నారు. అందుకు వంత పాడుతున్న వైసీపీ ఎమ్మెల్యేలు ,మంత్రులకు అంత కన్నా సిగ్గు లేదని విమర్శించారు. అమరావతి వెలుగు కార్యక్రమలో భాగంగా రైతులు దీపాలు వెలిగించి నినాదాలుచేశారు. రాజధాని 29 గ్రామాల్లో ఆందోళనలు కొనసాగాయి.



ఆరుపళ్ల విభాగంలో బండ లాగుతున్న ఎడ్లజత

ఆరుపళ్ల విభాగంలో
కాకుమాను ఎడ్లజత విజేత

మాచవరం, ఫిబ్రవరి21: మండలంలోని మోర్జంపాడు గ్రామంలో నిర్వహిస్తున్న శ్రీ లక్ష్మీనరసింహస్వామి 58వ కల్యాణమహోత్సవం సందర్భంగా రాష్ట్రస్థాయి ఎడ్ల బలప్రదర్శన పోటీలు జరుగుతున్నాయి. బుధవారం నిర్వహించిన ఆరుపళ్ల విభాగంలో గుంటూరు జిల్లా కాకుమాను మండలం, కొండబాలవారిపాలెం గ్రామానికి చెందిన గూడవల్లి లక్ష్మీదీక్షితచౌదరి ఎడ్లు 5,200 అడుగుల దూరాన్ని లాగి ప్రథమ స్థానంలో నిలిచాయి. గుంటూరు జిల్లా పత్తిపాడు గ్రామానికి చెందిన పమిడి అంజయ్య చౌదరి, గుంటూరు జిల్లా కాకుమాను మండలం కొండబాలవారిపాలెం గ్రామానికి చెందిన గూడవల్లి లక్ష్మీదీక్షిత చౌదరి కంబైన్డ్ ఎడ్లజత 4,800 అడుగుల దూరాన్ని లాగి రెండవ స్థానంలో నిలిచాయి. గుంటూరు జిల్లా కాకుమాను మండలం కొండపాటూరు గ్రామానికి చెందిన పోతిన లక్షిత్ చౌదరి ఎడ్లు 4533.10 అడుగుల దూరాన్ని లాగి మూడవ స్థానంలో నిలిచాయి.

నాలుగుపళ్ల విభాగంలో..

నాలుగుపళ్ల విభాగంలో జరిగిన పోటీల్లో గుంటూరు జిల్లా మేడికొండూరు మండలం సరిపూడి గ్రామానికి చెందిన వెదుళ్లపల్లి శ్రీనివాసరావు, పాలడుగు గ్రామానికి చెందిన శాఖమూరి విజయ్‌పవన్‌కుమార్ కంబైన్డ్ ఎడ్లజత 5,000 అడుగుల దూరాన్ని లాగి ప్రథమస్థానంలో నిలిచాయి. పల్నాడు జిల్లా సత్తెనపల్లి మండలం రామచంద్రాపురం గ్రామానికిచెందిన దండు అప్పారావు, బాపట్ల జిల్లా బల్లికురువ మండలం గంగపాలెం గ్రామానికిచెందిన రాయుడు సుబ్బారావు కంబైన్డ్ ఎడ్ల జత 4680.5 అడుగుల దూరాన్ని లాగి రెండవ స్థానంలో నిలిచాయి. ప్రకాశం జిల్లా యర్రగొండపాలెం మండలం వై.కొత్తపల్లి గ్రామానికి చెందిన కపులూరి హుస్సేన్ ఎడ్లజత 4658.10 అడుగుల దూరాన్ని లాగి మూడవ స్థానంలో నిలిచాయి. సూరప నేని రాధాకృష్ణ, దుగ్గి శ్రీనివాసరావులు న్యాయ నిర్ణేత లుగా వ్యవహరిస్తున్నారు.

గుర్తుతెలియని వ్యక్తిని గొంతుకోసి హత్య

దాచేపల్లి, ఫిబ్రవరి 21: గుర్తుతెలియని వ్యక్తిని గొంతుకోసి హత్య చేసినట్లు పోలీసులు గుర్తించారు. బుధవారం దాచేపల్లి ఎస్ఐ శివనాగరాజు తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని పొందుగల గ్రామంవద్ద రాష్ట్ర రవాణాశాఖ చెక్‌పోస్టు సమీపంలో గుర్తుతెలియని వ్యక్తి చనిపోయి వుండటాన్ని స్థానికులు గుర్తించి పోలీసులకు సమాచారం అందజేశారు. ఘటనా స్థలానికి చేరుకొని విచారిం చగా మృతుడు 40నుంచి 45 సంవత్సరాల మధ్య వయసు కలిగివున్నాడని, మెడవద్ద కత్తితో కోసినట్లు గాయం ఉన్నట్లు తెలిపారు. అతను ధరిం చిన దుస్తులను బట్టి లారీ డ్రైవర్‌గా భావిస్తున్నారు. మృతదేహాన్ని గురజాల ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. దాచేపల్లి ఎస్ఐ శివనాగరాజు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

నెక్ సూచించిన కోడిగుడ్ల ధర

- విజయవాడ జోన్ ప్లాస్టిక్ ట్రేలో సరఫరా చేసే ఫారం గేటు గుడ్డు ధర రూ.5.15
- నెక్ విజయవాడ ఆఫీస్ ఫోన్: 74165 82559

బ్రాయిలర్ ధరలు

అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్

బ్రాయిలర్ బర్డ్	155, 164,175
చికెన్ విత్ స్కిన్	300.00
చికెన్ స్కిన్ లెస్	310.00

1,35,644 మిర్చి టిక్కీల అమ్మకం

గుంటూరు, ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి): మిర్చియార్డుకు బుధవారం 1,39,400 మిర్చి టిక్కీలు విక్రయానికి రాగా అందులో 1,35,644 అమ్మకం జరిగినట్లు గుంటూరు వ్యవసాయ మార్కెట్ కమిటీ జాయింట్ డైరెక్టర్ కాకుమాను శ్రీనివాసరావు తెలిపారు. ఇంకా యార్డు ఆవరణలో 1,09,411 మిర్చి టిక్కీలు నిల్వ ఉన్నట్లు పేర్కొన్నారు. వివిధ రకాల మిరపకాయలకు ధరలు ఈ కింది విధంగా నమోదయ్యాయి.

వెరైటీ	కనిష్ఠధర	గరిష్ఠధర
నాన్ ఏసీ కామన్ వెరైటీ		
334	9000	20700
నెంబరు. 5	13000	19000
273	12500	16500
341	12000	20000
4884	13700	17500
సూపర్ 10	16200	19000
నాన్ ఏసీ స్పెషల్ వెరైటీ		
తేజ	8000	21000
బ్యాడిగి	9500	20000
దేవనూరు డీలక్స్	12000	20000
తెల్లకాయలు	5000	12000

బాపట్ల వార్తలు



శింగుపాలెంలో మహిళలకు కరపత్రాలను అందిస్తున్న టీడీపీ నాయకులు

చంద్రబాబుతోనే రాష్ట్రాభివృద్ధి సాధ్యం

● ఎమ్మెల్యే సోదరుడు అనగాని శివప్రసాద్

రేపల్లె, ఫిబ్రవరి 21 : టీడీపీ, జనసేన పార్టీకి గెలుపుకోసం కృషి చెయ్యాలని రాష్ట్రం అభివృద్ధి చెందాలంటే చంద్రబాబుతోనే సాధ్యమని ఎమ్మెల్యే సోదరుడు అనగాని శివప్రసాద్ అన్నారు. బుధవారం రేపల్లె మండలం శింగుపాలెంలో బాబు ష్యూరిటీ భవిష్యత్తుకు గ్యారంటీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇంటింటికి తిరుగుతూ వైసీపీ ప్రభుత్వం చేసిన విధ్వంసాలను ప్రజలకు వివరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రానున్నది టీడీపీ, జనసేన సంయుక్త ప్రభుత్వమేనని వైసీపీ అధికారంలోకి వచ్చాక రాష్ట్రంలోని ప్రజలు ఎన్నో ఇబ్బందులకు గురయ్యారన్నారు. ప్రతిపక్షాలను అణగతొక్కేందుకు పోలీసులను అడ్డం పెట్టుకుని తప్పుడు కేసులు బనాయించి కుట్రపూరితంగా వ్యవహరించారన్నారు. రానున్న ఎన్నికల్లో టీడీపీకి అండగా ఉండాలని, గెలుపే ధ్యేయంగా పనిచేయాలని కోరారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు రేపల్లె రామాంజనేయులు, జీ లక్ష్మీజీ, కుసర వెల్లి వెంకటేశ్వరరావు, సురేష్, జనసేన నాయకులు తదితరులు పాల్గొన్నారు.

టీడీపీ, జనసేన నాయకులు ఎన్నికలకు సిద్ధం కావాలి

చెరుకుపల్లి, ఫిబ్రవరి 21: ప్రజల అభివృద్ధి కోసం తపించే పార్టీ టీడీపీ మాత్రమేనని బాపట్ల జిల్లా కార్యనిర్వహక కార్యదర్శి తాతా ఏడుకొండలు అన్నారు. మండలంలోని మెట్టగౌడపాలెం, రాజవోలు గ్రామాల్లో బాబు ష్యూరిటీ భవిష్యత్తుకు గ్యారంటీ కార్యక్రమాలను నిర్వహించారు. ఈ సందర్భంగా ఇంటింటికి తిరుగుతూ సూపర్ సిక్స్ పథకాలను ప్రజలకు వివరించారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు మల్లాది రామకృష్ణ, మొహమాటం రాధాకృష్ణమూర్తి, పిట్టు శ్రీనివాస్‌రెడ్డి, బాపట్ల పార్లమెంట్ ఆర్గనైజింగ్ సెక్రటరీ తాతా ఏడుకొండలు, నియోజకవర్గ పొలిటికల్ మేనేజర్ పూషడపు కుమారస్వామి, బట్టు స్వామి తదితరులు పాల్గొన్నారు.

చంద్రబాబునాయుడుతోనే ఉపాధి అవకాశాలు మెరుగు

నగరం, ఫిబ్రవరి 21: యువతకు ఉపాధి అవకాశాలు కావాలన్న మన రాష్ట్రం ప్రగతి పథంలో నడవాలన్న మరోసారి నారా చంద్రబాబునాయుడు ముఖ్యమంత్రి అయితేనే సాధ్యమని మాజీ ఎంపీపీ విచారపు వీరయ్య అన్నారు. బుధవారం నగరం మండలంలోని కారంకివారిపాలెం బాబు ష్యూరిటీ భవిష్యత్తుకు గ్యారంటీ కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో మాజీ జడ్పీటీసీ మేకా వెంకట శివ రామకృష్ణ, నగరం టీడీపీ అధ్యక్షుడు చింతల సుబ్బారావు, ఆళ్ళ చౌదరి, పీవీ చింతారావు, జనసేన మండల అధ్యక్షుడు ఉదయకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

పేద కుటుంబాలపై నిర్లక్ష్య వైఖరి తగదు

● అఖిలభారత రైతుకూలీసంఘం నాయకుడు మేకల ప్రసాద్

బాపట్ల,ఫిబ్రవరి 21: పేద కుటుంబాలపై ప్రభుత్వం నిర్లక్ష్యవైఖరి అనుసరించటం సరికాదని అఖిలభారత రైతుకూలీసంఘం ఉమ్మడి గుంటూరు జిల్లా కార్యదర్శి మేకలప్రసాద్ తెలిపారు. పట్టణంలోని కర్లపాలెంరోడ్డులో మాదాల నారాయణ స్వామి కాలనీకి 13 సంవత్సరాలుగా విద్యుత్ సౌకర్యం, రహదార్లు కల్పించకపోవటంతోపాటు నివేశన స్థలాల పట్టాలు మంజూరు చేయకపోవటం దారుణమంటూ నిరసన తెలియజేశారు. ఈ విషయమై డిప్యూటీ తహసీల్దార్ శ్రీదేవికి బుధవారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా మేకలప్రసాద్ మాట్లాడుతూ వెదుళ్ళపల్లి గ్రామపంచాయతీ పరిధిలోని కొల్లా వెంకయ్యకాలనీలో నివాసం ఉండే వారికి ఉచిత పట్టాలు మంజూరు చేయకపోవటం దురదృష్టకరమన్నారు. రెండు కాలనీల అభివృద్ధికి ఎమ్మెల్యే కోన రఘుపతి అడ్డుపడుతున్నారని ఆరోపించారు.

నాయకుల మృతికి సంతాపం

సీపీఐ (ఎంఎల్) న్యూడెమోక్రసి రాష్ట్ర నాయకులు, ఐఎఫ్‌టీయూ రాష్ట్ర కార్యదర్శి కూరపాటి రామారావు, సభ్యులు రామకృష్ణారెడ్డిల మృతికి బాపట్ల నాయకులు బుధవారం జరిగిన సమావేశంలో సంతాపం ప్రకటించారు. వారి పటాలకు పుష్పాంజలి ఘటించి విప్లవ జోహార్లు అర్పించారు. బాపట్ల అంబేద్కర్ భవన్‌లో ఐఎఫ్‌టీయూ నాయకులు ఎ.శ్రీనివాసరావు అధ్యక్షతన జరిగిన సంతాప సభలో అఖిలభారత రైతుకూలీ సంఘం ఉమ్మడి గుంటూరు జిల్లా కార్యదర్శి మేకల ప్రసాద్, పివోడబ్ల్యూ సహాయ కార్యదర్శి శీలం ఏసమ్మ తదితరులు పాల్గొన్నారు.

అత్యంత వైభవంగా మహాసుదర్శన హోమం



తులసీదళ సహిత పుష్పార్చన చేస్తున్న పండితులు

బాపట్ల, ఫిబ్రవరి 21: లలిత త్రిపురసుందరి పీఠం ఆధ్వర్యంలో బాపట్ల చీలురోడ్డుసెంటర్లో ఉన్న పాండురంగ స్వామివారి దేవాలయ ప్రాంగణంలో తులసీ దళ సహిత పుష్పార్చన, మహిళలతో సామూహిక దీపాలక్ష్మీపూజ అనంతరం శ్రీలక్ష్మీ సుదర్శనహోమం అత్యంత వైభవంగా నిర్వహించారు. ఎమ్మెల్యే కోన రఘుపతి, రమాదేవి దంపతులు పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. నిర్వాహకులు నెమలికంటి హనుమంతరావు ఆధ్వర్యంలో జరిగిన ఈ విశేష కార్యక్రమంలో రొంపిచర్ల కేశవాచార్యులు, శ్రీనివాసుల విఖనస మూర్తి, కొల్లిపరప్రసాదస్వామి, పరాశరం రఘురాం, పంగులూరి కౌండిన్యశర్మ, ఆలయధర్మకర్త మార్బూరి బదిరి నారాయణ, జి.నీరజదేవి పాల్గొన్నారు. శ్రీలలిత త్రిపురసుందరి వ్యవస్థాపకులు నెమలికంటి హనుమంతరావు ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమానికి భక్తజనం పెద్దసంఖ్యలో హాజరై పూజలు చేశారు.

అనాధశరణాలయ నిర్మాణానికి శ్రీకారం



శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే కోన రఘుపతి

బాపట్ల, ఫిబ్రవరి 21: తల్లిదండ్రులు లేని అనాధ పిల్లలకు ఎంతోకాలంగా సేవ లందిస్తున్న శారాఫెయిత్ ఫౌండేషన్ భవన నిర్మాణానికి బుధవారం ఎమ్మెల్యే కోన రఘుపతి శంఖుస్థాపన చేసి శిలాఫలకాన్ని ఆవిష్కరించారు. భవన నిర్మాణానికి ఎమ్మెల్యే కోన రఘుపతి స్థలం ఇవ్వటంతోపాటు తగిన చేయూతనందించి శంకుస్థాపన చేయటం ఆనందదాయకమని సంస్థ డైరెక్టర్ జాషువా తెలిపారు. కార్యక్రమంలో మల్లెల శామ్యూల్, ధారా సునీల్‌బాబు, జి.వెంకట్ పాల్గొన్నా రు.

పాఠశాలలో వార్షిక తనిఖీలు



పాఠశాలలోని రికార్డులను పరిశీలిస్తున్న ఎంఈవో-1 ఉయ్యూరి వెంకటేశ్వరరావు

పిట్టలవానిపాలెం, ఫిబ్రవరి 21 : మండలపరిధిలోని అల్లూరు గ్రామ పంచాయతీలోని నత్తల వారిపాలెం ప్రాథమిక పాఠశాల, అలకాపురం గ్రామపంచాయతీలోని ప్రాథమిక పాఠశాలలను బుధవారం వార్షిక తనిఖీలలో భాగంగా మండల విద్యాశాఖాధికారి-1 ఉయ్యూరి వెంకటేశ్వరరావు సందర్శించి రికార్డులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయా పాఠశాలలోని ప్రధానోపాధ్యాయులతో మాట్లాడుతూ పాఠశాలలోని విద్యార్థులకు ప్రభుత్వం అందజేస్తున్న మౌలిక సదుపాయాలను సక్రమంగా అందేవిధంగా చూడాలన్నారు. పాఠశాలలోని విద్యార్థులకు నాణ్యతా ప్రమాణాలతో కూడిన విద్యనందించటంతోపాటు జగనన్న గోరుముద్ద, విద్యార్థు లకు యూనిఫామ్స్, పుస్తకాలు సక్రమంగా అందేవిధంగా చూసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులు కె.శివప్రసాద్, పాఠశాలల ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

గడ్డివామి దగ్ధం



దగ్ధమవుతున్న గడ్డి

కర్లపాలెం, ఫిబ్రవరి 21 : కర్లపాలెం మండలం నర్రావారిపాలెంలో దొంతిబోయిన శేషమ్మకు చెందిన రెండెకరాల గడ్డివామి అగ్నిప్రమాదంలో దగ్ధమైంది. ప్రమాదానికి కారణాలు తెలియరాలేదు. ప్రమాదం జరిగిన వెంటనే స్థానికులు మంటలు ఆర్పి మరింత ప్రమాదం జరగకుండా చూశారు.

తెలుగుదేశంతోనే యువతకు ఉజ్వల భవిష్యత్తు

● టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి వేగేశన నరేంద్రవర్మ



సమావేశంలో మాట్లాడుతున్న వేగేశన నరేంద్రవర్మ

బాపట్ల, ఫిబ్రవరి 21: తెలుగుదేశంతోనే యువతకు ఉజ్వల భవిష్యత్తు ఉంటుందని ఆ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి వేగేశన నరేంద్రవర్మ స్పష్టం చేశారు. బాపట్ల తెలుగుదేశంపార్టీ కార్యాలయంలో బుధవారం సాయంత్రం ఫస్ట్ ఓటు ఫర్ సీబీఎన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. కళాశాలల విద్యార్థులతో ఏర్పాటు చేసిన ఈ సమావేశంలో నరేంద్రవర్మ మాట్లాడుతూ నియోజకవర్గంలోని నిరుద్యోగుల వివరాలు సేకరించి వారి అర్హతను బట్టి చుట్టుపక్కల రాష్ట్రాల్లో ప్రభుత్వ, ప్రైవేట్ ఉద్యోగాలు వచ్చే విధంగా కృషి చేస్తామన్నారు. నియోజకవర్గంలో 8వేల మంది నూతనంగా ఓటుహక్కు పొందారన్నారు. వీరంతా తెలుగుదేశం వైపు మొగ్గు చూపే విధంగా టీం పనిచేస్తుందన్నారు. అదేవిధంగా 23శాతం తటస్థ ఓట్లు ఉన్నాయని వీరిని కూడా టీడీపీ వైపు ఆకర్షించాలని తెలిపారు. జనసైనికుల అండతో జగన్‌ను గౌరవంగా ఇంటికి సాగనంపుదామన్నారు. సమావేశంలో టీడీపీ రాష్ట్ర కార్యదర్శి సలగల రాజశేఖర్, రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరి తాతా జయప్రకాష్ నారాయణ, పార్లమెంట్ మహిళా ప్రధాన కార్యదర్శి పల్లం సరోజినీ, యువనాయకులు తాతా హరిచంద్ర ప్రసాద్, ముప్పా శరత్‌చంద్ర, కరీముల్లా, పార్లమెంట్ ప్రధాన కార్యదర్శి తానికొండ దయాబాబు, కర్లపాలెం మండల అధ్యక్షుడు భూపతిరావు, వీరయ్యనాయుడు, గ్లోరియానేట్ పాల్గొన్నారు.

రాష్ట్రానికి చంద్రబాబు నాయకత్వం అవసరం

పరిపాలనదక్షత కలిగిన తెలుగుదేశంపార్టీ అధినేత నారా చంద్రబాబునాయుడు నాయకత్వం రాష్ట్రానికి అవసరమని వేగేశన నరేంద్ర వర్మ తెలిపారు. ఇంటింటికి తెలుగుదేశం, మీమాట- నాబాట, జనసేన, టీడీపీ జనబాట కార్యక్రమాన్ని మండలంలోని మరు ప్రోలువారిపాలెంలో బుధవారం సాయంత్రం నిర్వహించారు. టీడీపీ, జనసేన నాయకులతో కలిసి ఇంటింటా తిరుగుతూ మహిళలకు చీరలు, సంచులు, కరపత్రాలు అందజేసి ఉమ్మడి మేనిఫెస్టో గురించి వివరించారు. నరేంద్రవర్మ మాట్లాడుతూ రాబోయే సార్వత్రిక ఎన్నికలలో బాపట్ల ఎమ్మెల్యే అభ్యర్థిగా తెలుగుదేశంపార్టీ నుంచి పోటీ చేస్తున్న తనకు మీ ఆశీస్సులు అందించి అధిక మెజార్టీతో గెలిపించాలని ఆకాంక్షించారు. మహిళలను తోబుట్టువులుగా భావించి చీర, పసుపు, కుంకుమ ఇచ్చి ఆశీస్సులు కోసం వచ్చానని తెలిపారు. ఆదరించి ఆశీర్వదించాలని కోరా రు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ దాసరి యోహాను, ఎస్సీసెల్ రాష్ట్ర నాయకులు బడుగు నాగేశ్వరరావు, దండమూడి సంధ్యారాణి, రమాదేవిపాల్గొన్నారు.

మాతృభాషను మరిచితే మనుగడ ఉండదు

● అష్టావధాని చంద్రమౌళి రామారావు

బాపట్లటౌన్, ఫిబ్రవరి 21: మాతృభాషను మరిచితే మనుగడలేదని ప్రముఖ కవి, అధ్యాపకులు, అష్టావధాని చంద్రమౌళి రామారావు, పద్య కవి రచయిత సంధానీ శ్రీరాములు, సాహితీభారతి అధ్యక్షులు రావూరి నరసింహవర్మలు సంయుక్తంగా తెలిపారు. బుధవారం సాహితీభారతి ఆధ్వర్యంలో సీనియర్ సిటిజన్ కార్యాలయంలో జరిగిన మాతృభాష దినోత్సవ సభకు సీనియర్ సిటిజన్ జిల్లా అధ్యక్షుడు జీవి బ్రహ్మం అధ్యక్షత వహించి ప్రసంగించారు. ఈ సందర్భంగా చరిత్ర పరిశోధకులు మన్నె శ్రీనివాసరావు, పద్యకవి రచయిత సంధాని శ్రీరాములును, కవి చంద్రమౌళి రామారావులను సాహితీభారతి రచయితలు రావూరి నరసింహవర్మ, ఆదంషఫి, ఎం మాల్యాద్రిరావు, బొడ్డుపల్లి శ్రీరామచంద్రమూర్తి తదితరు లు పూలమాలతో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో బొలగాని వెంకటేశ్వర్లు, మోహన్‌కుమార్, దీవి శ్రీనివాసమూర్తి, ఎస్ గుప్తా, కృష్ణారావు, సుబ్రహ్మణ్యం పాల్గొన్నారు.



పద్యకవి రచయిత సంధానీ శ్రీరాములను సన్మానిస్తున్న సాహితీభారతి రచయితలు, సీనియర్ సిటిజన్స్ తదితరులు

మాతృభాషను అభివృద్ధి చేద్దాం

రేపల్లె, ఫిబ్రవరి 21: మాతృభాష పరిరక్షణకు ప్రతి విద్యార్థి తప్పనిసరి గా కృషి చెయ్యాలని ముఖ్యఅతిథి గుంటూరు హిందూ కళాశాల అధ్యాపకులు నందనవనం శ్రీనివాసరావు అన్నారు. బుధవారం స్థానిక ఏబీఆర్ డిగ్రీ కళాశాలలో అంతర్జాతీయ మాతృభాషా దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలుగు భాష గొప్పతనం అమ్మ మాట తియ్యదనం ఒక్కటేనన్నారు. తెలుగు బాషపై మక్కువ పెంచుకునే విధంగా ఉపాధ్యాయులు కృషి చెయ్యాలని సూచించారు. ప్రభుత్వం తెలుగు భాషపై శ్రద్ధ చూపి అభివృద్ధి దిశగా ముందుకు వెళ్లాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ టీసీ రవీంద్రకుమార్, వైస్ ప్రిన్సిపాల్ వై.కోటేశ్వరరావు, ఆనందరావు, భీమయ్య, కె.సురేష్‌కుమార్, తదితరులు పాల్గొన్నారు.



మాతృ భాష దినోత్సవ సభలో మాట్లాడుతున్న ఎస్.శ్రీనివాసరావు

పదిలో అత్యుత్తమ ప్రతిభ కనబరచాలి

నగరం, ఫిబ్రవరి 21: రాబోయే 10వతరగతి పబ్లిక్ పరీక్షల్లో విద్యార్థులు అందరూ అత్యుత్తమ ప్రతిభ కనబరిచి ఉత్తమ ఫలితాలను సాధించాలని పెద్దవరం జడ్పీహెచ్ఎస్ స్కూల్ ప్రధానోపాధ్యాయులు బద్రీ నారాయణ అన్నారు. బుధవారం ప్రాథమిక పాఠశాలలో స్కూల్ వార్షికోత్సవ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ప్రైవేటు పాఠశాలలకు దీటుగా ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులను తీర్చిదిద్దామన్నారు. అనంతరం సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. కార్యక్రమంలో ఎస్ఎంసీ చైర్మన్ సుబ్బారావు, సర్పంచ్ హరేరామ్, రమేష్ నెప్రహా, రాఘవయ్య, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

కల్తీ పదార్థాలు అమ్మితే కఠిన చర్యలు

చెరుకుపల్లి, ఫిబ్రవరి 21:కల్తీ పదార్థాలను ప్రజలకు అమ్మివారి ఆరోగ్యాలను పాడుచేసే వ్యక్తులపై కఠిన చర్యలు తీసుకుంటామని జిల్లా ఫుడ్ ఇన్‌స్పెక్టర్ కె.దేవరాజు అన్నారు. బుధవారం ఆయన చికెన్ పకోడి బండి, టీస్టాల్‌ను తనిఖీ చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ రోడ్ల ప్రక్కన వ్యాపారులు అమ్మకాలు చేసే పదార్థాలపై దుమ్ముపడకుండా చూసుకోవాలన్నారు. టీపొడిలో కల్తీ లేకుండా స్వచ్ఛమైన టీపొడిని వాడాలన్నారు. మాంస విక్రయాలు చేసేవారు నిల్వ ఉంచిన మాంసాన్ని అమ్మరాదని హెచ్చరించారు. కల్తీ వ్యాపారాలు చేస్తే షాపులపై కేసులు నమోదు చేస్తామని చెప్పారు.

అగ్నిప్రమాద బాధితురాలికి ఆర్థికసాయం

బాపట్ల, ఫిబ్రవరి 21 : మండలంలోని ముత్తాయపాలెం గ్రామంలో సంభవించిన అగ్నిప్రమాదంలో ఇల్లు దగ్ధమై ఇబ్బందులు పడుతున్న గవిని శ్రీరాములు కుటుంబాన్ని ఎమ్మెల్యే కోన రఘుపతి బుధవారం పరామర్శించారు. బాధిత కుటుంబానికి 10వేల రూపాయలు ఆర్థికసాయం అందజేసి అన్ని విధాలా అండ గా ఉంటామని హామీ నిచ్చారు. కార్యక్రమంలో గ్రామస్థులు, పార్టీ శ్రేణులు పాల్గొన్నారు.

రామాలయంలో ఏకనామ పారాయణం

కర్లపాలెం, ఫిబ్రవరి 21 : కర్లపాలెం మండలం తెలుగపాలెం రామాలయంలో భీష్మఏకాదశి సందర్భంగా బుదవారం ఉదయం నుంచి భజనలు రామరామ ఏక నామపారాయణం చేశారు. ఈ కార్యక్రమంలో భక్తులు పాల్గొన్నారు.



రామాలయంలో ఏకనామ పారాయణం చేస్తున్న భక్తులు



రైతులకు బహుమతులు అందజేస్తున్న పశుసంవర్ధకశాఖ డీడీ డాక్టర్ కేదారేశ్వర్

ప్రభుత్వ పథకాలను వినియోగించుకోవాలి

● పశుసంవర్ధశాఖ డీడీ డాక్టర్ కేదారేశ్వర్

వేమూరు, ఫిబ్రవరి 21 : పశు సంపద రైతులు ప్రభుత్వ పథకాలను వినియోగించుకోవాలని పశు సంవర్ధకశాఖ డీడీ డాక్టర్ కేదారేశ్వర్ పేర్కొన్నారు. మండలంలోని చావలి గ్రామంలో బుధవారం పశు సంవర్ధశాఖ, పశు గణాభివృద్ధి సంస్థ సంయుక్త ఆధ్వర్యంలో మేలుజాతి లేగ దూడల ప్రదర్శన కార్యక్రమం నిర్వహించారు. చావలి పశు వైద్యాధికారి చినమునియ్య అధ్యక్షతన జరిగిన కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన డీడీ మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పాడి రైతులకు అనేక పథకాలను ప్రవేశపెట్టాయన్నారు. అసిస్టెంట్ డైరెక్టర్ డాక్టర్ జనార్ధనరావు మాట్లాడుతూ పాడి పరిశ్రమ ద్వారా రైతులు ఆర్థిక పరిపుష్టిని పెంచుకోవచ్చునన్నారు. వేమూరులో ప్రత్యేకమైన ల్యాబ్‌ను ఏర్పాటు చేశారని దానిని సద్వినియోగం చేసుకోవాలన్నారు. లేగదూడల ప్రదర్శనలో పలు గ్రామాలకు చెందిన రైతులు తమ దూడలను ప్రదర్శనలో ఉంచారు. మొదటి ఐదు మేలు జాతి దూడల రైతులకు డిడి కేదారేశ్వర్ చేతుల మీదుగా బహుమతులు అందజేశారు.

అనంతవరం జడ్పీ ఉన్నత పాఠశాల వార్షికోత్సవం

కొల్లూరు, ఫిబ్రవరి 21: జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల 64వ వార్షికోత్సవం ఘనంగా నిర్వహించారు. బుధవారం మండల పరిధిలోని అనంతవరం జడ్పీహెచ్ఎస్ పాఠశాల వార్షికోత్సవంలో గతంలో ఈ పాఠశాలలో ప్రధానోపాధ్యాయులుగా పనిచేసిన డానియేల్, ఉపాధ్యాయుడు సుబ్బారావులు ముఖ్యఅతిథులుగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా 1997-98 సంవత్సరంలో పదో తరగతి చదివిన పూర్వ విద్యార్థులు మూడు సంవత్సరాలుగా పదవ తరగతి చదువుతున్న విద్యార్థినీ విద్యార్థులకు పరీక్షలకు అవసరమైన సామగ్రి పంపిణీ చేస్తున్నా రు. ఈ వేడుకల్లో కూడా వాటిని అందజేశారు. పరీక్షల్లో ప్రతిభ పాటవాలు చూపిన విద్యార్థులకు కూడా నగదు ప్రోత్సాహక బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో హెచ్ఎం శ్రీనివాసరావు, పూర్వ విద్యార్థులు, ఉపాధ్యాయులు, సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

నెల రోజుల నుంచి తాగునీటికి ఇబ్బందులు

కొల్లూరు, ఫిబ్రవరి 21: మండల పరిధిలోని తడికలపూడి గ్రామంలో పంచాయతీ ఆధ్వర్యంలో రక్షిత మంచినీటి పథకం ద్వారా గ్రామస్థులకు తాగునీరు అందుతుంది. అయితే నెల రోజులుగా మంచినీటి పథకం సం బంధించిన మోటారు పని చేయకపోవడంతో తాగునీరు సరఫరా నిలిచిపోయింది. దీనిపై సర్పంచ్‌ని గ్రామస్థులు ప్రశ్నించగా పంచాయతీలో నిధులు లేవని దాని వల్ల మరమ్మతులు చేయించలేదని సమాధానం ఇచ్చారని గ్రామస్థులు ఆరోపిస్తున్నారు. నెల రోజుల్లో కేవలం మూడు రోజులు మాత్రమే నీటి సరఫరా జరిగిందని, వీధి దీపాలు కూడా సరిగా వెలగడం లేదని, వెలగని దీపాలు స్థానంలో కొత్త దీపాలు అమర్చడం కూడా చేయ డం లేదంటూ గ్రామస్థులు వాపోతున్నారు.

కాంగ్రెసు నాయకుల గృహ నిర్బంధం

వేమూరు, ఫిబ్రవరి 21: కాంగ్రెసు పార్టీ రాష్ట్ర అధ్యక్షురాలు షర్మిల ఇచ్చిన పిలుపు మేరకు గురువారం చలో సెక్రటేరియట్ కార్యక్రమా నికి అనుమతి లేదంటూ పోలీసులు పలువురు నాయకులను గృహ నిర్బంధం చేశారు. వేమూరు నియోజకవర్గంలోని 15మంది కాంగ్రెసు పార్టీ నాయకులను బుధవారం రాత్రి 10 గంటలకు పోలీసులు గృహ నిర్బంధం చేసి నోటీసులు జారీ చేశారు.

నగరం కళాశాల విద్యార్థిని ఉత్తమ ప్రదర్శన

నగరం, ఫిబ్రవరి 21: ప్రపంచ స్థాయి పోటీల్లో భారతదేశం తరపు నుంచి నగరం ఎస్వీఆర్ఎం కళాశాల నాగిడి గాయత్రి(ఫస్టు బీఎస్సీ) విద్యార్థిని పాల్గొనబోవటం మన రాష్ట్రానికే గర్వకారమణమని ఎస్వీఆర్ఎం కళాశాల సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ వల్లభనేని బుచ్చయ్యచౌదరి అన్నారు. ఆమెకు అన్ని వసతులు కళాశాల తరపున ఏర్పాటు చేశామని తెలిపారు. మొట్టమొదటిసారిగా ఇంటర్నేషనల్ ఈవెంట్‌లో ఇండియా తరపున ప్రాతినిధ్యం వహించటాన్ని కళాశాలకు చెందిన పీజీ డైరెక్టర్ కేసన సురేంద్రబాబు, కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ హరికృష్ణ, కళాశాల అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ ఎం.సుధాకర్, కళాశాల ఫిజికల్ డైరెక్టర్ వి.సాంబమూర్తి, అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బంది అభినందనలు తెలిపారు.



విద్యార్థిని అభినందిస్తున్న కళాశాల యాజమాన్యం

ప్రతి ఒక్కరూ దైవచింతనతో మెలగాలి

రేపల్లె, ఫిబ్రవరి 21: ప్రతి ఒక్కరూ దైవ చింతనతో మెలిగితే ఆ కుటుంబాలు సుఖసంతోషాలతో ఉంటాయని ఎమ్మెల్యే సోదరుడు అనగా ని శివప్రసాద్ అన్నారు. బుధవారం మండలంలోని నల్లూరు సౌత్ గ్రా మంలో నూతనంగా నిర్మించిన అభయాంజనేయస్వామి విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవంలో ఎమ్మెల్యే అనగాని సోదరుడు అనగాని శివప్రసాద్ ప్రత్యే క పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామ ప్రజల సంయుక్త సహకారంతో నిర్మించిన ఆంజనేయస్వామి దేవా లయం వల్ల గ్రామంలోని ప్రజలంతా సుఖసంతోషాలతో ఉంటారని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో గ్రామపెద్దలు, ఆలయ కమిటీ సభ్యులు, టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

మీడియాపై దాడిని తీవ్రంగా ఖండిస్తున్నాం

● టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యుడు, మాజీ మంత్రి ఆనందబాబు

భట్టిప్రోలు, ఫిబ్రవరి 21: ప్రజాస్వామ్యాన్ని బతికించడానికి మూలస్తంభంగా ఉన్న మీడియాపై వైసీపీ గూండాల దాడిని తీవ్రంగా ఖండిస్తున్నామని మాజీ మంత్రి నక్కా ఆనందబాబు అన్నారు. పత్రికా విలేకర్లు, సంస్థలపై దాడులను వ్యతిరేకిస్తూ భట్టిప్రోలు ప్రెస్ క్లబ్ ఆధ్వర్యంలో బుధవారం స్థానిక రథం సెంటర్లో జర్నలిస్టులు నిర్వహించిన నిరసన కార్యక్రమానికి మాజీ మంత్రి ఆనందబాబుతో పాటు పలు రాజకీయ పార్టీల నేతలు సంఘీభావం తెలియజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైసీపీ ప్రభుత్వం పాలనలో ప్రజలతో పాటుగా పత్రికా విలేకరులపై అరాచకం పెరిగిపోయిందన్నారు. రాప్తాడులో జరిగిన సిద్ధం సభలో సీఎం జగన్‌రెడ్డి ప్రసంగిస్తున్న సందర్భంలోనే ఆంధ్రజ్యోతి ఫోటోగ్రాఫర్ శ్రీకృష్ణపై వైసీపీ గూండాలు విచక్షణా రహితంగా దాడి చేసి తీవ్రంగా గాయపరచడం అప్రజాస్వామికమన్నారు. సీఎం జగన్‌రెడ్డి కనుసన్నల్లోనే ఇలాంటి దాడులు జరుగుతున్నాయని ఆయన ఆరోపించారు. కర్నూలు జిల్లాలో ఎమ్మెల్యే అవినీతిని బయటపెట్టినందుకు ఈనాడు కార్యాలయంపై రాళ్ళ దాడి చేయించారని ఆయన పేర్కొన్నారు. ఇటీవల రాజధాని ప్రాంతంలో ఈనాడు ఫోటోగ్రాఫర్‌ను తీవ్రంగా కొట్టి హత్యాయత్నం చేసేందుకు వైసీపీ గూండాలు ప్రయత్నించారన్నారు. ప్రజాస్వామ్యాన్ని బతికించేందుకు జర్నలిస్టులు నిత్యం పోరాడుతూనే ఉంటారని జగన్ సొంత మీడియా సాక్షిలో పని చేసే రిపోర్టర్లు కూడా ఆలోచన చేయాలన్నారు. గతంలో చిన్న రిపోర్టుకు అన్యాయం జరిగినా దాడి జరిగినా అందరూ స్పందించే వారని ప్రస్తుతం అలాంటి పరిస్థితులు లేకపోవడం శోచనీయమని పత్రికా విలేకరులపై జరుగుతున్న దాడులను త్రిప్పికొట్టేందుకు విలేకరులందరూ ఏకం కావాలని ఆయన పిలుపునిచ్చారు. అధికార పార్టీ పత్రికా విలేకర్లు, యాజమాన్యాలపై చేస్తున్న దాడులపై విలేకర్లు చేస్తున్న నిరసన కార్యక్రమాలకు తెలుగుదేశం పార్టీ అండగా నిలుస్తుందని ఆనందబాబు హామీనిచ్చారు. నిరసన కార్యక్రమానికి సీపీఐ నాయకులు గొట్టుముక్కల బాలాజీ, సీపీఎం నాయకులు జి.నాగరాజు, ఎస్ఎఫ్ఐ నాయకులు పి.మనోజ్‌లు మద్దతుగా నిలిచారు. ఈ కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర కార్యదర్శి తూనుగుంట్ల సాయిబాబా, నాయకులు బట్టు మల్లికార్జునరావు, కె. సుందరరావు, మాచర్ల నాగరాజు, బొర్రా శరాబంది, పత్రికా విలేకర్లు పాల్గొన్నారు.

పాత్రికేయులపై దాడిని ఖండిస్తూ తీర్మానం

బాపట్ల, ఫిబ్రవరి 21: వైసీపీ శ్రేణులు ఆంధ్రజ్యోతి, ఈనాడు పాత్రికేయులపై దాడి చేయటాన్ని తీవ్రంగా ఖండిస్తూ తెలుగుదేశంపార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి వేగేశన నరేంద్ర వర్మ ఆధ్వర్యంలో పార్టీశ్రేణులు బుధవారం ఏకగ్రీవ తీర్మానం చేశారు. ఇలాంటి దుర్మార్గపుచర్యలపై తక్షణమే చర్యలు తీసుకోవాలని పోలీసులను డిమాండ్ చేశారు. ప్రజాస్వామ్య దేశంలో ఇలాంటి దాడులు దుర్మార్గమన్నారు.

పత్రికా ప్రతినిధులపై దాడులు దారుణం : మానం విజేత

ప్రభుత్వానికి, ప్రజలకు మధ్య వారధిగా పనిచేసే పత్రికా ప్రతినిధులపై వైసీపీ మూకలు దాడి చేయటం దారుణమని మాజీ ఎంపీపీ మానం విజేత పేర్కొన్నారు. ఈ విషయమై బుధవారం ఆమె మాట్లాడుతూ రాప్తాడులో ఫోటోగ్రాఫర్ శ్రీకృష్ణపై వైసీపీ రౌడిమూకలు చేసిన దాడిని తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. అదే విధంగా ఈనాడు కార్యాలయంపై, పాత్రికేయుడిపై దాడి చేసినందుకు సభ్యసమాజం సిగ్గుపడుతుందన్నారు.

పోలింగ్ బూత్‌లను పరిశీలించిన ఎన్నికల అధికారి



ఉర్దూ స్కూల్లో పోలింగ్ బూత్‌ను పరిశీలిస్తున్న ఎన్నికల అధికారి వసంతరాయుడు

భట్టిప్రోలు, ఫిబ్రవరి 21: నియోజకవర్గ ఎన్నికల అధికారి ఎస్ఎస్‌టీబీ వసంతరాయుడు బుధవారం మండలంలోని 48 పోలింగ్ కేంద్రాలను పరిశీలించారు. మండలంలోని 15గ్రామ పంచాయతీలలో గల 48 పోలింగ్ కేంద్రాలను రెవెన్యూ అధికారులతో కలిసి సందర్శించి పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఓటర్లు స్వేచ్ఛాయుతంగా ఓటు హక్కును వినియోగించుకునేలా ఏర్పాట్లు చేయాలన్నారు. పోలింగ్ కేంద్రాల్లో ర్యాంపులు ఏర్పాటు చేయాలని, తాగునీరు, విద్యుత్ సరఫరా, బాత్‌రూంలు సిద్ధంగా ఉంచా ల న్నారు. పోలింగ్ కేంద్రాల్లో వసతులు ఏర్పాట్లపై రెవెన్యూ అధికారులు ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలని ఆదేశించారు. కార్యక్రమంలో మండల తహసీల్దార్ సీహెచ్ పద్మావతి, ఎలక్షన్ సిబ్బంది రాజేష్, తదితరులు పాల్గొన్నారు.

కొల్లూరు మండలంలో పరిశీలన పూర్తి

కొల్లూరు, ఫిబ్రవరి 21 : మండల గ్రామాల్లోని పోలింగ్ కేంద్రాలు పరిశీలన పూర్తయినట్లు తహసీల్దార్ వి.పుల్లారావు తెలిపారు. బుధవారం మండలపరిధిలోని గ్రామాల్లో ఉన్న పోలింగ్ కేంద్రాలను జడ్పీ సీఈవో వసంతరాయుడు పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయా కేంద్రాల్లో ఉన్న వసతి సౌకర్యాలను అధికారులు ఆయనకు వివరించారు. మొత్తం మండలంలో 54 పోలింగ్ కేంద్రాలు ఉండగా అన్నిం టిని పరిశీలించినట్లు అధికారులు తెలిపారు. పరిశీలన కార్యక్రమంలో జడ్పీటీసీతో పాటు తహసీల్దార్, ఎంపీడీవో లక్ష్మీకుమారి, ఏవో ఆర్ వెంకటేశ్వరరావు, ఎంఈవో జ్యోతి, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

విద్యార్థులకు కాస్మొటిక్ ఛార్జీలు విడుదల చేయాలి

భట్టిప్రోలు, ఫిబ్రవరి 21 : బీసీ హాస్టల్ విద్యార్థులకు కాస్మోటిక్ చార్జీలు తక్షణమే విడుదల చేయాలని ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు పి.మనోజ్‌కుమార్ కోరారు. స్థానిక బీసీ హాస్టల్‌కు వచ్చిన అసిస్టెంట్ బీసీ వెల్ఫేర్ అధికారి రవిప్రకాష్‌కు వినతిపత్రం అందజేశారు. సామాజిక చైతన్య సాధికారిక యాత్రలు చేయడంతోనే సరిపోదని సంక్షేమ హాస్టళ్ళ విద్యార్థుల సంక్షేమం పట్టదా అని ప్రశ్నించారు. విద్యారంగంలో సమూల మార్పులు చేసినట్లు గొప్పలు చెప్పుకుంటున్న ప్రభుత్వం సంక్షేమ హాస్టళ్ళల్లో విద్యార్థులకు అందించాల్సిన కాస్మోటిక్ ఛార్జీలు, ట్రంక్ పెట్టెలు, నోట్ బుక్స్ ఎందుకు ఇవ్వ లేదన్నారు. వెంటనే డైట్ ఛార్జీలు కూడా విడుదల చేయాలని మనోజ్ డిమాండ్ చేశారు.

క్యాలెండర్‌ను ఆవిష్కరించిన మాజీ మంత్రి ఆనందబాబు

భట్టిప్రోలు, ఫిబ్రవరి 21: శ్రీలీలాభవానీ పద్మశాలీయ గోవాడ అన్న సత్రం క్యాలెండర్లను బుధవారం మాజీ మంత్రి నక్కా ఆనందబాబు ఆవిష్కరించారు. శివరాత్రి పర్వదినంను పురస్కరించుకుని మండలంలోని ఐలవరం గ్రామంలో గోవాడ అన్నసత్రం క్యాలెండర్లను ఆనందబాబు ఆవిష్కరించి పంపిణీ చేశారు. కార్యక్రమంలో అన్న సత్రం సభ్యులు, పద్మశాలీయ సంఘీయులు పాల్గొన్నారు.

నిష్పక్షపాతంగా ఓటర్‌లిస్టుల తయారీ : ఆర్డీవో

రేపల్లె, ఫిబ్రవరి 21: సబ్ డివిజన్ పరిధిలో నిష్పక్షపాతంగా ఓటర్‌లిస్టు తయారీకి కృషి చేస్తున్నామని రేపల్లె ఆర్డీవో హేలా షారోన్ అన్నా రు. బుధవారం స్థానిక ఆర్డీవో కార్యాలయంలో వివిధ రకాల పార్టీ నాయకులు సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ నియోజకవర్గంలోని సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలపై పటిష్ట భద్రత ఏర్పాటు చేసే విధంగా చర్యలు తీసుకుంటామన్నారు. ఓటర్ లిస్టులోని తప్పుల తనిఖీలను సరిచెయ్యటంతో పాటు కొత్త ఓట్లను చేర్పులు జరుగుతున్నాయన్నారు. నిరాధారమైన ఓటర్లను తొలగించటం జరుగుతుంద ని తెలిపారు. ఈకార్యక్రమంలో టీడీపీ న్యాయవాది యరగాళ్ళ ధర్మతేజ, సీఐటీయూ సీహెచ్ మణిలాల్, ఆర్డీవో సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

వలంటీర్ వందనానికి సగం మంది డుమ్మా

కొల్లూరు, ఫిబ్రవరి 21 : వలంటీర్ వందనం కార్యక్రమానికి సగం మంది వలంటీర్లు డుమ్మా కొట్టారు. బుధవారం కొల్లూరు మండల పరిషత్ కార్యాలయ సమావేశ మందిరంలో వలంటీర్లకు వందనం కార్యక్రమం ఏర్పాటు చేశారు. కార్యక్రమానికి వైసీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి వరికూటి అశోక్‌బాబు ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. మండలంలో ఎంతమంది వలంటీర్లు ఉన్నారని ఆరా తీయగా మొత్తం 280 మంది వరకు వలంటీర్లు ఉన్నారని అధికారులు సమాధానం ఇచ్చారు. అంత మంది వలంటీర్లు ఇక్కడ కనిపించడం లేదని ప్రశ్నించగా అందరూ ఉన్నారంటూ చెప్పడంతో సగం మంది కూడా ఇక్కడ లేరని వలంటీర్లను అభినందించేందుకు ఏర్పాటు చేసిన కార్యక్రమానికి కూడా వారు గైర్హాజరు అయితే ఎలాగంటూ ఆయన అసహనం వ్యక్తం చేశారు. గైర్హాజరైన వలంటీర్లతో సమావేశం నిర్వహించి వారి నుంచి సంజాయిషీ తీసుకోవాలని అధికారులకు సూచించారు.

నేడు వలంటీర్లకు అవార్డుల ప్రదానం

పిట్టలవానిపాలెం, ఫిబ్రవరి 21: మండలంలోని 14గ్రామ పంచాయతీ పరిధిలోని 12 సచివాలయాలకు సంబంధించి వలంటీర్లకు బుధవారం బాపట్ల వ్యవసాయ కళాశాల ప్రాంగణంలో 201 మంది వలంటీర్లకు సంబంధించి ఇద్దరికి సేవా వజ్ర, ఐదుగురికి సేవా రత్న, మిగిలిన వారికి సేవామిత్ర అవార్డులతోపాటు సన్మాన కార్యక్రమం జరుగుతుందని పిట్టలవానిపాలెం మండల ప్రజాపరిషత్ అభివృద్ధి అధికారి బి.వి.రమణమూర్తి తెలిపారు.


సమావేశంలో మాట్లాడుతున్న ఈఆర్‌వో వెంకటేశ్వర్లు

సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలపై ప్రత్యేక దృష్టి

● ఈఆర్‌వో కె.వెంకటేశ్వర్లు

పర్చూరు, ఫిబ్రవరి 21: సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలపై ప్రత్యేక దృష్టి సారించనున్నట్లు పర్చూరు నియోజకవర్గ ఎన్నికల ప్రత్యేక అధికారి కె.వెంకటేశ్వర్లు అన్నారు. బుధవారం స్థానిక రెవెన్యూ కార్యాలయంలో అఖిలపక్ష రాజకీయ నాయకులతో సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఈఆర్‌వో మాట్లాడుతూ నియోజకవర్గ వ్యాప్తంగా 1,390 దరఖాస్తులు పెండింగ్‌లో ఉన్నాయన్నారు. అందులో ఫాం 7కి సంబంధించి 859, ఫాం -8కు 179, ఫారం 6 నూతనంగా ఓటుకోసం దరఖాస్తు చేసుకున్నవి 350 పెండింగ్‌లో ఉన్నాయన్నారు. ఓట్ల తొలగింపునకు సంబంధించి ఫారం 7 విషయంలో కలెక్టర్, సీఈవో అనుమతితో మాత్రమే తొలగిస్తామన్నారు. ఫారం 6, ఫారం 8కు సంబంధించి వచ్చిన దరఖాస్తులు రోజూ స్థానిక తహసీల్దార్ కార్యాలయంలోనే మానిటరింగ్ చేస్తున్నామన్నారు. ప్రతి పోలింగ్ కేంద్రంలో ఓటర్లకు ఎలాంటి అసౌకర్యం కల్గకుండా పూర్తిస్థాయిలో వసతులు కల్పించే విధంగా చర్యలు తీసుకుంటామన్నారు. ఈకార్యక్రమంలో పర్చూరు, కారంచేడు తహసీల్దార్లు సీహెచ్.సుబ్బయ్య, మోహార్ కుమార్, ఎలక్షన్ డీటీ సత్యనారాయణ అఖిలపక్ష పార్టీల నేతలు ఉన్నారు.


ముస్లింల ఆత్మీయ సమావేశం
పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న ముస్లిం మైనార్టీ నాయకులు

ముస్లింల ఆత్మీయ సమావేశాన్ని విజయవంతం చేయండి

చినగంజాం, ఫిబ్రవరి 21 : పర్చూరులోని అద్దంకి నాంచారమ్మ కల్యాణ మండపంలో ఈ నెల 25వ తేదీ సాయంత్రం 5గంటలకు నిర్వహించే ముస్లింల ఆత్మీయ సమావేశాన్ని విజయవంతం చేయాలని టీడీపీ రాష్ట్ర మైనార్టీ సెల్ ఆర్గనైజింగ్ సెక్రటరీ అబ్దుల్‌రజాక్ పిలుపునిచ్చారు. స్థానిక టీడీపీ కార్యాలయ ఆవరణలో పార్టీ మండల ప్రధాన కార్యదర్శి సయ్యద్ అబ్దుల్‌కలాంఅజాద్ ఆధ్యక్షతన మండల పరిధిలోని ముస్లిం మైనార్టీ నాయకులతో బుధవారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. అనంతరం మండల ముస్లిం నాయకులతో కలిసి పర్చూరులో జరిగే ముస్లిం ఆత్మీయ సమావేశం వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ పర్చూరు మండల మాజీ అధ్యక్షులు జమాలుద్దీన్, కారంచేడు మండల ప్రధాన కార్యదర్శి ఖాసీం, ఇంకొల్లు మైనార్టీ సెల్ మండల అధ్యక్షులు బాబర్‌భాషా, పర్చూరు నియోజకవర్గ మైనార్టీ సెల్ అధ్యక్షులు రసూల్, టీడీపీ మండల ముస్లిం మైనార్టీ అధ్యక్షులు షేక్ జిలాని, షేక్.హుస్సేన్‌భాష, షేక్.సలాం, మండల ముస్లిం మైనార్టీ నాయకులు పాల్గొన్నారు.


పొగాకు పంటను సాగు చేసే రైతులతో
విదేశీ యూఎల్‌టీసీ కంపెనీ ప్రతినిధులు

పొగాకు పంటను పరిశీలించిన విదేశీ ప్రతినిధులు

యద్దనపూడి, (మార్టూరు) ఫిబ్రవరి 21: యద్దనపూడి మండలంలో సాగు చేస్తున్న నల్ల బర్లీ పొగాకు (హెచ్‌డీబీఆర్‌జీ) పంటలను బుధవారం విదేశీ ప్రతినిధులైన ముగ్గురు యూఎల్‌టీసీ కంపెనీ ప్రతినిధులు పరిశీలించారు. మండలంలోని చింతపల్లిపాడు, యనమదల, అనంతవరం ప్రాంతంలోని సాగు చేస్తున్న పొగాకు పంటలను వారు పరిశీలించారు. తరువాత పంటలను సాగు చేస్తున్న రైతులతో మాట్లాడారు. అంతర్జాతీయ స్థాయిలో నల్ల బర్లీ పొగాకుకు గుర్తింపు రావడానికి కారణం రైతులు సుస్థిరమైన పద్ధతిలో పంటను సాగు చేయడమని, దాంతో రైతులు సాగు చేస్తున్న పంటలను స్వయంగా పరిశీలించడానికి ఈ ప్రాంతానికి వచ్చామని ప్రతినిధులు తెలిపారు. ఈ కార్యక్రమంలో విదేశీ కంపెనీ ప్రతినిధులు లిమా స్కాట్, లూయిస్ ఫ్లవర్, బ్రాడ్లీ ఫైకలు పంటలను పరిశీలించగా, జీపీఐ కంపెనీ ప్రతినిధులు వైఎస్ పాటిల్, సందీప్ కుమార్, పునీత, ఉమా మహేష్‌లతో పాటు పలువురు పొగాకు రైతులు పాల్గొన్నారు.


యద్దనపూడిలో నాయనమ్మ సుబ్బాయమ్మ అంతిమయాత్రలో
ఎమ్మెల్యే గొట్టిపాటి రవికుమార్

స్వర్గీయ గొట్టిపాటి హనుమంతరావు మాతృమూర్తి మృతి

● అంతిమయాత్రలో పాల్గొన్న ఎమ్మెల్యే రవికుమార్

యద్దనపూడి, (మార్టూరు) ఫిబ్రవరి 21: యద్దనపూడి గ్రామంలో స్వర్గీయ గొట్టిపాటి హనుమంతరావు మాతృమూర్తి సుబ్బాయమ్మ (98) అనారోగ్యంతో మంగళవారం రాత్రి మృతి చెందారు. అద్దంకి శాసన సభ్యులు గొట్టిపాటి రవికుమార్ తండ్రి శేషగిరిరావు స్వయానా హనుమంతరావుకు సోదరుడు కావడంతో బుధవారం నాయనమ్మ సుబ్బాయమ్మ అంత్యక్రియలలో రవి కుమార్ పాల్గొన్నారు. ఆమె పార్థీవ దేహం వద్ద నివాళులు అర్పించిన అనంతరం ఇంటి నుంచి ప్రారంభమయిన అంతిమయాత్రలో తుది వరకు రవికుమార్‌తో పాటు గొట్టిపాటి భరత్ నడిచారు. అద్దంకి మాజీ శాసన సభ్యులు బాచిన చెంచు గరటయ్య, అసిస్ట్ సంస్థ డైరెక్టర్ జాష్టి రంగారావు తదితరులు యద్దనపూడి గ్రామానికి వచ్చి సుబ్బాయమ్మ పార్థీవ దేహం వద్ద నివాళులు అర్పించారు. అదేవిధంగా అద్దంకి నియోజకవర్గం నుంచి పలువురు టీడీపీ నాయకులు యద్దనపూడి వచ్చి రవి కుమార్ ను కలిశారు.

పంటకు నీటి తడుల కోసం పాట్లు

కిలోమీటర్ల దూరం పైప్‌లు ఏర్పాటు చేసి పంపింగ్
ఎకరాకు రూ. 5 నుంచి 10 వేల ఖర్చు
రైతులకు మరింత భారం

అద్దంకి, ఫిబ్రవరి21: వ్యవసాయం భారంగా మారిన నేపథ్యంలో పంటలకు నీటి తడులు వేయాల్సి రావటంతో రైతులు మరింత ఆందోళన ఆందోళన చెందుతున్నారు. అయితే నోటికాడికి వచ్చిన పంటను ఎండ బెట్టుకోలేక, అదనపు భారం అయినా సుదూర ప్రాంతాల నుంచి సైతం నీటిని పంపింగ్ చేసి పొలాలకు పెడుతున్నారు. అద్దంకి ప్రాంతంలో ఆలస్యంగా సాగు చేసిన మొక్కజొన్న, పొగాకు, మిర్చి పంటలకు నీటి తడులు అవసరం అయ్యాయి. సాగర్ నీరు విడుదలై ఉంటూ పొలాలకు కాలువల ద్వారా నీరు పెట్టుకునే వీలు ఉండేది. అయితే ఈ ఏడాది సాగర్ నీరు విడుదల జరగకపోవటంతో నీటి తడుల కోసం రైతులు మరింత ఇబ్బంది పడుతున్నారు. దీంతో సుదూర ప్రాంతంలో ఉన్న నీటి వనరులను పొలాలకు చేర్చేందుకు రైతులు నానా అవస్థలు పడుతున్నారు.


అద్దంకి సమీపంలో నామ్ రోడ్డు వెంబడి పొలాలకు నాగులపాడు చెరువు నీటిని ట్రాక్టర్‌తో పంప్ చేస్తున్న రైతులు

ప్రతి మూడు నాలుగు వందల మీటర్లకు ఒక చోట ట్రాక్టర్‌ల ఇంజన్‌లు ఏర్పాటు చేసి నీటిని పంపింగ్ చేస్తున్నారు. ఒక్కో చోట కిలో మీటరు నుంచి రెండు కిలోమీటర్ల వరకు పంపింగ్ చేయాల్సి ఉండటంతో మూడు, నాలుగు చోట్ల ట్రాక్టర్‌లను వినియోగిస్తున్నారు. దీంతో ఒక్కో ఎకరాకు నీటి తడుల కోసం 5 వేల నుంచి 10 వేల రూపాయల అదనపు భారం పడుతుందని రైతులు ఆందోళన చెందుతున్నారు. అసలే వ్యవసాయం భారంగా మారిన తరుణంలో నీటి తడుల కోసం అదనపు ఖర్చు చేయాల్సి రావటం మరింత వ్యయంగా మారిందని రైతులు ఆందోళన చెందుతున్నారు.


నీటి తడులు పెడుతున్న మొక్కజొన్న చేను


ఎకరాకు రూ. 5 వేలకు పైగా ఖర్చు

పంటలు ఎండిపోయే దశలో ఉండటంతో నీటి తడులు పెట్టాల్సి వస్తుంది. సుమారు కిలోమీటరన్నర దూరంలో ఉన్న చెరువు నుంచి 3 చోట్ల ట్రాక్టర్‌లకు పంప్‌సెట్‌లు ఏర్పాటు చేసి నీటిని పంపింగ్ చేస్తున్నాం. ఎకరాకు 5 వేల రూపాయల ఖర్చు అవుతోంది.

-శేషారెడ్డి, రైతు, అద్దంకి

జగనన్న కాలనీలో ఇచ్చిన ఇళ్ల పట్టాలు మార్చండి

కలెక్టర్‌ను కోరిన పూనూరు మహిళలు

యద్దనపూడి, (మార్టూరు) ఫిబ్రవరి 21: గ్రామానికి దూరంగా ఉన్నాయని, అక్కడ ఇళ్లు నిర్మించుకోవడానికి స్థలం సక్రమంగా లేదని, వాటిని రద్దు చేసి మరో చోట తమకు ఇంటి స్థలాలు ఇవ్వాలని మండలంలోని పూనూరు గ్రామానికి చెందిన 42 మంది మహిళలు కలెక్టర్ రంజిత్ బాషాకు వినతిపత్రం అందజేశారు. బుధవారం యద్దనపూడిలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో జగనన్నకు చెబుదాం స్పందన కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా కలెక్టర్ రంజిత్ బాషా పాల్గొని మాట్లాడుతూ ప్రజలనుంచి వచ్చే అర్జీలకు వెంటనే స్పందించాలని అధికారులను కోరారు. అధికారులు ప్రజలకు అందు బాటులో ఉండాలన్నారు.అనంతరం ప్రజలనుంచి వివిధ సమస్యలపై అర్జీలను స్వీకరించారు. పూనూరు గ్రామానికి చెందిన మహిళలు జగనన్న కాలనీలో ఇచ్చిన పట్టాలను రద్దు చేసి మరో స్థలంలో ఇవ్వాలని కలెక్టర్‌ను కోరారు. దీనిపై జాయింట్ కలెక్టర్ సీహెచ్ శ్రీధర్ మాట్లాడుతూ పూనూరు గ్రామ పంచాయతీ పరిధిలో ప్రభుత్వ స్థలం ఉంటే వివరాలు సేకరించాలని రెవెన్యూ ధికారులకు సూచించారు. అదేవిధంగా పలు గ్రామాలకు సంబంధించి భూసమస్యలపై 9 మంది కలెక్టర్‌కు అర్జీలను ఇచ్చారు. వాటి పరిష్కారానికి వెంటనే చర్యలు చేపట్టాలని ఆయన రెవెన్యూ అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. అదేవిధంగా అనంతవరం, యనమదల గ్రామాలలో పారిశుధ్య పనులు సక్రమంగా లేవని పలువురు కలెక్టర్ దృష్టికి తీసుకువెళ్లగా ఈ రెండు గ్రామాలలో త్వరితగతిన పారిశుధ్య పనులు చేపట్టాలని ఆయన సంబంధిత అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఆర్డీవో రవీందర్, నియోజకవర్గ ప్రత్యేక అధికారి రామకృష్ణ, మండల స్పెషల్ ఆఫీసర్ కరుణశ్రీ, ఎంపీడీవో శివ సుబ్రమణ్యం, మండల తహసీల్దారు వై.నాగరాజు, తదితర శాఖలకు చెందిన అధికారులు, పంచాయతీ కార్యదర్శులు, హెల్త్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.


భూ సమస్యపై కలెక్టరు రంజిత్ బాషాకు వివరిస్తున్న మహిళ

షర్మిల రాకతో కాంగ్రెస్‌లో నూతనోత్సాహం

- కేంద్ర మాజీ మంత్రి జేడీ శీలం

అద్దంకి, ఫిబ్రవరి 21: కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర అధ్యక్షురాలు గా వైఎస్ షర్మిల బాధ్యతలు చేపట్టిన తరువాత క్యాడర్‌లో నూతనోత్సాహం వచ్చిందని కేంద్ర మాజీ మంత్రి జేడీ శీలం అన్నారు. అద్దంకి నియోజకవర్గ కాంగ్రెస్ నేతలు, కార్యకర్తల ఆత్మీయ సమావేశం అడుసుమల్లి కిషోర్ బాబు అధ్యక్షతన బుధవారం స్థానిక అంబేడ్కర్ భవన్‌లో జరిగింది. ముఖ్య అతిథిగా హాజరైన శీలం మాట్లాడుతూ వైసీపీ, టీడీపీలు రా ష్ట్ర ప్రయోజనాలను గాలికి వదిలేసి స్వలాభం కోసం కేంద్రం ముందు మోకారిల్లాయని అన్నారు. ప్రత్యేక హోదా, పోలవరం, రైల్వే జోన్ లాంటి అంశాలను ఏనాడు ప్రశ్నించలేదన్నారు. స్టీలు ప్లాంట్ అమ్ముతుంటే కనీసం అభ్యంతరం చెప్పలేని దౌర్భాగ్య స్థితిలో రాష్ట్ర ప్రభుత్వం ఉందన్నారు. కాంగ్రెస్ పార్టీ ని క్షేత్ర స్థాయిలో మరింత బలోపేతం చేసేందుకు కష్టపడి పనిచేయాలన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న కేంద్ర మాజీ మంత్రి జేడీ శీలం

ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు గంటా అంజిబాబు, పీసీసీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు శ్రీపతి ప్రకాశం, జనరల్ సెక్రటరీ తోట శివనాగేశ్వరరావు, బాపట్ల పార్లమెంట్ సమన్వయకర్త ధూళిపాళ్ల కల్యాణచక్రవర్తి, అడుసుమల్లి కిషోర్‌బాబు, కోరే సురేంద్రనాద్, ఎర్రమోతు నాగయ్య, మండల పార్టీఅధ్యక్షులు లేళ్ళ సుబ్బారెడ్డి, సురేష్‌బాబు, అబ్రహాం, కబలా సుబ్రహ్మణ్యం తదితరులు పాల్గొన్నారు.


సాయికాలనీ రోడ్డులో బల్బేలేని విద్యుత్ స్తంభం

వెలగని వీధి లైట్లు గ్రామాల్లో అంధకారం

చీరాలటౌన్, ఫిబ్రవరి 21 : మండల పరిధిలోని గ్రామీణ ప్రాంతాలు సింహభాగం రాత్రి వేళల్లో అంధకారంలో ఉంటున్నాయి. గత ప్రభుత్వం హయాంలో ఆర్థిక సంఘాల నిధులలో వచ్చిన మొత్తాన్ని 15శాతం వరకు విద్యుత్ సౌకర్యాలకు ఖర్చు చేయగా ప్రస్తుతం 15వ ఆర్థిక సంఘం నిధులలో టైడ్ 60 శాతం, అన్‌టైడ్ 40 శాతం చేశారు. పైగా ఈ అన్‌టైడ్ 40 శాతంలో 10 శాతం మాత్రమే విద్యుత్ సౌకర్యాలకు ఉపయోగిస్తున్నారు. దీంతో గ్రామాల్లో పూర్తిగా సౌకర్యాలు అందని ద్రాక్షగా మారాయి. అయితే ప్రస్తుతం అన్‌టైడ్‌లో 10 శాతం కూడా లేక ఖజానా ఖాళీగా ఉంది. దీంతో వ్యవస్థ పూర్తిగా కుంటుపడింది. ఈక్రమంలో ఒక విద్యుత్ పోల్ వద్ద మరమ్మతులు చేపట్టాలంటే అధికారుల పరిస్థితి ఆందోళనగా మారుతోంది.

రెండు ఆర్టీసీ బస్సులు ఢీ


ప్రమాదంలో పూర్తిగా దెబ్బతిన్న ఆర్డినరీ బస్సు


ప్రమాదానికి కారణమైన ఆర్టీసీ ఎక్స్‌ప్రెస్ బస్సు

పలువురికి గాయాలు
తప్పిన పెను ప్రమాదం
పర్చూరు - గుంటూరు రహదారిలో బోడవాడ వద్ద సంఘటన
అతివేగమే కారణమంటున్న ప్రయాణికులు


పర్చూరు ప్రభుత్వ వైద్యశాలలో క్షతగాత్రులు

బోడవాడ(పర్చూరు), ఫిబ్రవరి 21: రెండు ఆర్టీసీ బస్సులు ఢీకొన్న ఘటనలో పలువురికి గాయాలయ్యాయి. ఈ సంఘటన పర్చూరు - గుంటూరు ఆర్ అండ్‌బీ రోడ్డులోని బోడవాడ సమీపంలో చోటుచేసుకుంది. ప్రయాణికులు, స్థానికుల సమాచారం మేరకు పర్చూరు నుంచి ప్రయాణికులతో గుంటూరు వెళుతున్న ఆర్డినరీ బస్సు బోడవాడ సమీపానికి చేరుకునే క్రమంలో గుంటూరు నుంచి ప్రయాణికులతో పర్చూరు వస్తున్న ఆర్‌టీసీ ఎక్స్‌ప్రెస్ బస్సు అతివేగంగా వచ్చి ఆర్డినరీ బస్సును ఢీకొంది. ఈ ప్రమాదంలో ఆర్డినరీ బస్సులో ప్రయాణిస్తున్న కంబంపాటి అక్కమ్మ, ఎం.తిరుపతమ్మ అనే ఇరువురు మహిళలకు తీవ్రగాయాలయ్యాయి. దీంతోపాటు పలువురు ప్రయాణికులకు స్వల్పగాయాలు అయ్యాయి. సమాచారం అందుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకొని ప్రమాదతీరును పరిశీలించారు. క్షతగాత్రులను 108 వాహనం ద్వారా పర్చూరు ప్రభుత్వ వైద్యశాలకు తరలించి, ప్రాథమిక చికిత్స అనంతరం గుంటూరు తరలించారు.

అతివేగమే ప్రమాదానికి కారణం

ఎక్స్‌ప్రెస్ బస్సు అతివేగంగా దూసుకు రావటం వల్లే ప్రమాదం జరిగిందని ప్రయాణికులు అంటున్నారు. బస్సు వేగాన్ని గుర్తించిన ఆర్డినరీ బస్సు డ్రైవర్ బస్సును మార్జిన్‌లోకి తీసుకుపోవటంతో ప్రాణాలతో బయట పడ్డామని ప్రయాణికులు తెలిపారు.

తప్పిన పెను ప్రమాదం

ప్రమాదం జరిగిన సమయంలో ఎక్స్‌ప్రెస్ బస్సులో 42 మంది, ఆర్డినరీ బస్సులో 15 మంది ప్రయాణికులు ఉన్నారు. ఎదురెదురుగా బస్సులు ఢీకొని ఉంటే పెద్ద ఎత్తున ప్రాణనష్టం జరిగి ఉండేదని ప్రయాణికులు అంటున్నారు.

నిర్ణీత వ్యవధిలో నిర్మాణం పూర్తి చేయాలి

- ఎమ్మెల్యే బలరాం

చీరాల,ఫిబ్రవరి 21 : చేపట్టిన పనులను నిర్ణీత కాలవ్యవధిలో పూర్తిచేసి ప్రజలకు మెరుగైన సేవలు అందించాలని ఎమ్మెల్యే కరణం బలరామకృష్ణమూర్తి చెప్పారు. మండలంలోని జాండ్రపేటలో రూ.7 లక్షల వ్యయంతో నిర్మాణం చేపట్టనున్న సీసీ రోడ్డుకు బుధవారం ఎమ్మెల్యే బలరాం శంకుస్థాపన చేశారు. ముందుగా స్థానిక మహాలక్ష్మమ్మ అమ్మవారి చెట్టు వద్ద ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో రాష్ట్ర అర్బన్ ఫైనాన్స్ కార్పొరేషన్ డైరెక్టర్ గవిని శ్రీనివాసరావు, వైసీపీ మండల అధ్యక్షుడు అంకాళ్‌రెడ్డి, బొడ్డు సుబ్బారావు, లేళ్ల శ్రీధర్, కట్టా గంగయ్య, పన్నెం ప్రసాద్, పృథ్వీ ధనుంజయ, సత్రం లవకుమార్, బక్కా శ్రీనివాసరెడ్డి, బొడ్డు సాంబశివరావు, గుంటూరు సుబ్బారావు పాల్గొన్నారు.


జాండ్రపేట మహాలక్ష్మమ్మ అమ్మవారి చెట్టు వద్ద పూజలు చేస్తున్న ఎమ్మెల్యే బలరామకృష్ణమూర్తి

లాడ్జి కిటికీ నుంచి పడి ఉద్యోగి మృతి

కేసు నమోదు చేసుకున్న వన్‌టౌన్ పోలీసులు


కరుణ కుమార్(48)ఫైల్

చీరాలటౌన్, ఫిబ్రవరి 21 : పశ్చిమ గోదావరి జిల్లా భీమవరంకు చెందిన అగ్రికల్చర్ ఉద్యోగి చీరాల పట్టణంలో బుధవారం అర్ధరాత్రి మృతిచెందాడు. వివరాల్లోకి వెళితే భీమవరంకు చెందిన గొంది కరుణకుమార్(48) అగ్రికల్చర్ అటెండర్. ఈక్రమంలో సహోద్యోగి సాయివంశీ, డ్రైవర్ శ్రీనుతో కలిసి వేటపాలెం మండలంలోని సంబంధిత డిపార్ట్‌మెంట్ ఉన్నతాధికారి ఇంట్లో శుభకార్యానికి మంగళవారం రాత్రి చీరాలకు వచ్చారు. బుధవారం ఫంక్షన్ కావడంతో చీరాల పట్టణంలోని రైల్వే స్టేషన్ సమీపంలోని ఓ లాడ్జిలో రూం బుక్ చేసుకున్నారు. ఈ సమయంలో సహచరులతో కలిసి మద్యం సేవించారు. అనంతరం ఇరువురు నిద్రించగా కరుణకుమార్ కిటికీలో కూర్చుని జారిపడి మృతిచెందాడు. సమాచారం అందుకున్న పోలీసులు అర్ధరాత్రి లాడ్జి వద్దకు చేరుకుని నిద్రలో ఉన్న ఇరువురిని లేపి విషయంపై ఆరా తీయగా వారు ఒక్కసారిగా ఉలిక్కిపడ్డారు. అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేశారు. ఏరియా వైద్యశాలలో పోస్టమార్టం అనంతరం మృతదేహాన్ని కుటుంబ సభ్యులకు అప్పగించారు. అయితే మిగిలిన ఇరువురిని వన్‌టౌన్ పోలీసులు అన్ని కోణాల్లో దర్యాప్తు చేస్తున్నారు. కరుణకుమార్ మృతితో ఆ జిల్లా నుంచి పెద్ద సంఖ్యలో ఉద్యోగులు చీరాలకు వచ్చారు. మృతి ప్రమాదవశాత్తుగానే జరిగినట్లు పోలీసులు భావిస్తున్నారు. మృతునికి మూడు నెలల పాప, భార్య ఉన్నారు.

హైవే సైడు కాల్వలపై మూతలు ఏర్పాటు

మార్టూరు, ఫిబ్రవరి 21: మార్టూరు సెంటర్లో గతంలో హైవే అధికారులు ఏర్పాటు చేసిన సైడు కాల్వలపై కొన్ని చోట్ల మూతలుగా ఉన్న బండ రాళ్లు పగిలిపోయాయి. మరి కొన్ని చోట్ల మూతలు లేకపోవడంతో సైడు కాల్వల నుంచి దుర్గంధం బయటకు వ్యాపిస్తున్నది. దానికి తోడు కొంతమంది ద్విచక్రవాహనదారులు ఈ సైడు కాల్వల వద్ద ప్రమాదానికి గురై కాల్వల్లో పడిపోయిన సంఘటనలు ఉన్నాయి. ఈ నేపథ్యంలో హైవే అధికారులు బుధవారం మార్టూరు సెంటర్లో సైడు కాల్వల్లో మూతలేని చోట్ల సిమెంటుతో ఏర్పాటు చేసిన బండ రాళ్లను మూతలుగా ఏర్పాటు చేశారు. ముఖ్యంగా మార్టూరులోని ప్రధాన సెంటర్లో సైడు కాల్వలపై మూతలను ఏర్పాటు చేశారు. గతంలో మురుగునీరు సక్రమంగా వెళ్లకుండా కాల్వలోనే నిలిచిపోవడంతో హైవే సిబ్బంది కొన్ని చోట్ల మూతలను తొలగించి మురుగునీరు సక్రమంగా వెళ్లే విధంగా చర్యలను చేపట్టారు. దాంతో కొన్ని చోట్ల తొలగించిన మూతలను మళ్లీ ఏర్పాటు చేయలేదు. ప్రస్తుతం వాటిపై కూడా మూతలను ఏర్పాటు చేశారు.


సైడు కాల్వపై భారీ క్రేన్‌తో సిమెంటు మూతలను ఏర్పాటు చేస్తున్న సిబ్బంది

పంచాయతీ భవన నిర్మాణానికి రూ.50వేల విరాళం

చీరాల,ఫిబ్రవరి 21 : మండలంలోని రామకృష్ణాపురం పంచాయతీ భవనంపై అంతస్తు నిర్మాణానికి డాక్టర్ గుంటుపల్లి సుబ్బారావు(హైమా సుబ్బారావు) రూ.50వేలు విరాళం ఇచ్చారు. బుధవారం తన వైద్యశాలలో పంచాయతీ కార్యదర్శి కిరణ్ కుమార్‌కు ఆ మొత్తాన్ని అందజేశారు. ఈ సందర్భంగా డాక్టర్ సుబ్బారావు మాట్లాడుతూ గ్రామస్థునిగా తన వంతు బాధ్యతగా విరాళం అందజేస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు దివి శివరాం, వెంకటేశ్వరరెడ్డిపాల్గొన్నారు.


రూ.50వేలు విరాళం అందజేస్తున్న డాక్టర్ హైమా సుబ్బారావు

27న అద్దంకిలో జాబ్ మేళా

అద్దంకి, ఫిబ్రవరి 21: ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో ఈ నెల 27 వ తేదీ ఉదయం 9 గంటలకు అద్దంకి లోని ప్రకాశం ప్రభుత్వ జూనియర్ కళాశాల ఆవరణ లో మెగా జాబ్ మేళా నిర్వహిస్తున్నట్లు జిల్లా నైపుణ్యాధికారి తమ్మాజీరావు ఒక ప్రకటనలో తెలిపారు. సుమారు 20 కంపెనీల ప్రతినిధులు హాజరవుతారని తెలిపారు. పూర్తి వివరాలకు 9542970871, 7989697996 సెల్ నెంబర్లను లేదా 9988853335 టోల్ ఫ్రీ నెంబర్‌ను సంప్రదించాలన్నారు.

బీజేపీ ప్రజా పోరుయాత్ర ప్రారంభం

చీరాల,ఫిబ్రవరి 21 : మండలంలోని పెర్లవారిపాలెం నుంచి బుధవారం బీజేపీ ప్రజా పోరుయాత్రను ప్రారంభించారు. ఈ సందర్భంగా ప్రముఖ న్యాయవాది బందారుపల్లి హేమంత్‌కుమార్ మాట్లాడుతూ దేశ ప్రగతి బీజేపీతోనే సాధ్యమన్నారు. అందుకు అనుగుణంగా ప్రజలను చైతన్య పరచటమే ప్రజా పోరుయాత్ర ఉద్దేశమన్నారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు ఆర్వపల్లి కుమార్, గౌరాబత్తుని జయశంకరరెడ్డి, నాగేశ్వరరావు, మేడికొండ భరణీరావు, బిట్రా శ్రీను, పెర్ల బ్రహ్మయ్య, బక్క మనోహరరెడ్డి, పెనుగొండ వెంకటేశ్వర్లు, కృష్ణప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.


బీజేపీ ప్రజా పోరుయాత్రలో కరపత్రాలు పంపిణీ చేస్తున్న నాయకులు

కరపత్రాల ఆవిష్కరణ

అద్దంకిటౌన్, ఫిబ్రవరి 21: ఎంఆర్‌పీఎస్, ఎంఎస్‌పీ వ్యవస్థాపక అధ్యక్షుడు మందా కృష్ణమాదిగ ఆంధ్రప్రదేశ్ ఉమ్మడి జిల్లాల పర్యటనలు చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన పర్యటనకు సంబంధించిన కరపత్రాలను బుధవారం ఎంఆర్‌పీఎస్, ఎంఈఎఫ్ నాయకులు స్థానిక అంబేడ్కర్ భవనంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మార్చి 2వ తేదీన అద్దంకిలోని బంగ్లారోడ్డులో ఉమ్మడి ప్రకాశం జిల్లా ఎంఆర్‌పీఎస్, ఎంఎస్‌పీ, ఎంఈఎఫ్ అనుబంధ సంఘాల సమావేశం జరుగుతుందన్నారు. ఆయా సంఘాల నేతలందరూ కార్యక్రమంలో పాల్గొని జయప్రదం చేయాలని కోరారు.


మధురమైనది తెలుగు భాష

చినగంజాం, ఫిబ్రవరి 21 :తెలుగు భాష ఎంతో మధురమైనదని మున్నంవారిపాలెం ప్రాథమిక పాఠశాల హెచ్‌ఎం. ఎం.మల్లారెడ్డి అన్నారు. మండలంలోని మున్నంవారిపాలెం మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో అంతర్జాతీయ మాతృ భాషా దినోత్సవాన్ని బుధవారం ఘనంగా నిర్వహించారు. మాతృభాషను గౌరవించాల్సిన బాధ్యత అందరిపై ఉందని హెచ్‌ఎం అన్నారు. తెలుగు భాషను కాపాడుకోవడం మనందరి కర్తవ్యమని అన్నారు. అభివృద్ధి అనే పేరుతో ఆంగ్ల భాష మోజులో పడి అమ్మ భాషను విస్మరిస్తున్నారని అన్నారు. అన్ని భాషలలో కల్లా మాతృ భాష అయిన తెలుగు గొప్పదనం గురించి విద్యార్థులకు వివరించారు. ఈ సందర్భంగా పాఠశాల ఆవరణలో విద్యార్థిని విద్యార్థులు అ అక్షరం ఆకృతిలో ఏర్పడి తెలుగు భాషాభిమానాన్ని చాటారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు ఎస్.నాగమల్లేశ్వరరావు, ఎన్.చంద్రశేఖర్, పి.హిమవంతేశ్వరి పాల్గొన్నారు.


అ అక్షర ఆకృతిగా ఏర్పడిన మున్నంవారిపాలెం పాఠశాల విద్యార్థులు

ద్విచక్ర వాహనం అదుపుతప్పి యువకుడు మృతి

చీరాలటౌన్, ఫిబ్రవరి 21 : చీరాల పరిధిలోని ప్రసాద్‌నగర్‌లో ద్విచక్ర వాహనం అదుపుతప్పి వ్యక్తి మృతిచెందాడు. ఈ సంఘటన బుధవారం ఉదయం జరిగింది. టూటౌన్ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం వాడరేవుకు చెందిన గొర్రెముచ్చు సన్నీ, మీనాలకు శశిధర్(18) ఒక్కగానొక్క కుమారుడు. తండ్రి మత్స్యకారుడు కావడంతో కుటుంబ ఆర్థిక పరిస్థితుల కారణంగా చదవుకునే పరిస్థితిలేక ఇంటర్ మధ్యలో ఆపి తండ్రితో పాటు వేటకు వెళుతున్నాడు. ఈక్రమంలోనే బుధవారం చీరాలకు ద్విచక్ర వాహనంపై వచ్చి తిరిగి వెళుతుండగా ప్రసాద్‌నగర్ సమీపంలో ముందు వెళుతున్న మరో వాహనాన్ని దాటేందుకు ప్రయత్నిస్తూ వాహనం అదుపుతప్పి రోడ్డు పక్కన ఉన్న చెట్టును ఢీ కొట్టాడు. దీంతో తీవ్ర రక్తగాయాలతో కొన ఊపిరితో ఉన్న శశిధర్‌ను స్థానికులు చీరాల ఏరియా వైద్యశాలకు తరలించారు. అయితే వైద్య పరీక్షలు నిర్వహించిన వైద్యులు గుంటూరుకు సిఫారసు చేశారు. సంబంధిత ఏర్పాట్లు జరుగుతుండగానే తుదిశ్వాస విడిచాడు. టూటౌన్ పోలీసులు కేసు నమోదు చేసుకుని పోస్టమార్టం అనంతరం మృతదేహాన్ని కుటుంబ సభ్యులకు అప్పగించారు.


గొర్రెముచ్చు శశిధర్(ఫైల్)

శింగరకొండలో వైవీ ప్రత్యేక పూజలు

అద్దంకి, ఫిబ్రవరి21: టీటీడీ మాజీ చైర్మన్, రాజ్యసభ సభ్యునిగా ఎన్నికైన వైవీ సుబ్బారెడ్డి బుధవారం రాత్రి శింగరకొండ ప్రసన్నాంజనేయస్వామి దేవాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. రాజ్యసభ సభ్యుని గా నామినేషన్ దాఖలు చేసే ముందు కూడా శింగరకొండలో పూజలు నిర్వహించిన వైవీ ఎన్నికైన అనంతరం మరలా బుధవారం పూజలు నిర్వహించారు. ప్రత్యేక పూజల అనంతరం వైవీ సుబ్బారెడ్డిని ఈవో సుభద్ర, పూజారులు ఆశీర్వదించి సత్కరించారు. వైసీపీ అద్దంకి నియోజకవర్గ ఇన్‌చార్జి పాణెం హనిమిరెడ్డి, వైవీ భద్రారెడ్డి, మారం వెంకారెడ్డి, కాకాని రాధాకృష్ణమూర్తి తదితరులు ఉన్నారు.

రెండు ఇసుక ట్రాక్టర్లు పట్టివేత

వేటపాలెం(చీరాల),ఫిబ్రవరి 21 : అనుమతులు లేకుండా అక్రమంగా ఇసుక తరలిస్తున్న రెండు ఇసుక ట్రాక్టర్లను వేటపాలెం ఎస్సై సురేష్ సిబ్బందితో కలిసి పట్టుకున్నారు. ట్రాక్టర్లను స్టేషన్‌కు తరలించారు. డ్రైవర్లను అదుపులోకి తీసుకున్నారు. కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై సురేష్ తెలిపారు.